మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :78 | ఆదివారం , 16 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

## నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఉద్రిక్తత



కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టండి..

-కేటీఆర్ పిలుపు

2లో

# మోదీ కులంపై వివాదం..

## సంచలన వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్


హైదరాబాద్,15ఫిబ్రవరి(క్రాంతిన్యూస్): తెలంగాణలో ఇటీవల సీఎం రేవంత్ సర్కారు కులగణన సర్వే ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా.. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు మరోసారి వార్తలలో నిలిచాయి. తెలంగాణలో చేపట్టిన కులగణనను రాహుల్ గాంధీకి క్లియర్ గా వివరించినట్లు రేవంత్ తెలిపారు. ఈ సర్వే పూర్తిగా శాస్త్రియంగా జరిగిందన్నారు. తెలంగాణలో బహిరంగ సభకు సన్నాహాలు చేస్తున్నామని, దీనికి రాహుల్ గాంధీ తప్పక హాజరవుతారన్నారు. రాహుల్ గాంధీ చెప్పిన ఆదేశాలను తూచా తప్పకుండా ఫాలో అయినట్లు చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర కులగణన దేశానికి రోడ్ మ్యాప్ వంటిదన్నారు. ప్రతిపక్షాలు కావాలనే కులగణనపై లేని పోనీ రాద్ధాంతం చేస్తున్నాయని సీఎం రేవంత్ మండిపడ్డారు. రాజకీయ కోణంలో కాదు ప్రజా సంక్షేమ కోణంలోనే కులగణన జరిగిందని క్లారిటీ ఇచ్చారు. కావాలనే కొందరు ప్రజలను ఉద్రేకపరిచే విధంగా ప్రయత్నం చేస్తున్నరన్నారు. కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు బిల్లు తీసుకొస్తామన్నారు.



## రాహుల్ గాంధీది ఏ కులం..

### కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



ప్రధాని మోడీ కులంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఫైర్ అవుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కులంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపుతున్నాయి. నరేంద్ర మోదీ పుట్టుకతో బీసీ కాదని, లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని రేవంత్ రెడ్డి అన్నారు.

## రేపు పుస్తెలతాళ్లు లాక్కెళతారా?

### తెలంగాణ ఆడబిడ్డలారా కాంగ్రెస్ సర్కారుతో జెర పైలం - కేటీఆర్

వ్యవసాయరంగంలో సంతోషం ఆనవాళ్లు చెరిపేసి, సమైక్యరాష్ట్రంలో పీడించిన సంక్షోభం ఆనవాళ్లను తెలంగాణ నేలపై మళ్లీ తెస్తామంటే రైతాంగం సహించదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆత్మగౌరవంతో బతికే అన్నదాతలపై ఈ వరుస దాష్టీకాలేంటని, మీరు చేసిన పాపాలకు బక్కచిక్కిన రైతులపై ఈ దుర్మార్గాలేంటని ప్రశ్నించారు.



# ఆఖరి సీఎం అయినా ఫర్వాలేదు

## - రేవంత్ రెడ్డి

“నేను ఆఖరి ముఖ్యమంత్రి అయిన పర్వాలేదు.. నాకు ఎటువంటి ఇబ్బంది లేదు. మా నాయకుడు కోరుకున్న లక్ష్యానికి అనుగుణంగా పనిచేశాను అనే సంతృప్తి మిగిలితే చాలు.. ఇంతకుమించి నేను ఏమీ కోరుకోవడం లేదు. ఇప్పుడు మేము చేసిన కుల గణన మీద చాలామంది రకరకాల ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పుడు గనక ఈ కులగణన ఆధారంగా న్యాయం జరగకపోతే.. బీసీలు ఎప్పుడూ అభివృద్ధి చెందలేదు” ఇవీ శుక్రవారం గాంధీ భవన్ వేదికగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు.

2లో



## తెలంగాణను నీటి సంక్షోభంలోకి నెట్టేసిన కాంగ్రెస్ సర్కారు

2లో

## కొత్త రేషన్ కార్డుల జారీ ఇప్పట్లో లేనట్టే



తెలంగాణలో ఎక్కడ చూసినా కొత్త రేషన్ కార్డుల గురించే చర్చ నడుస్తోంది. జనవరి 26వ తేదీన రేవంత్ రెడ్డి సర్కార్ కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే.. అంతకు ముందే ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఆధారంగా చేసుకుని క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి.. అర్హుల జాబితాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ జాబితాలను గ్రామసభల్లో ప్రకటించారు కూడా. అయితే.. ఆ జాబితాల్లో లేని చాలా మంది తాము కూడా అర్హులమేనని.. అయినా తమ పేర్లు జాబితాల్లో రాలేదంటూ గగ్గోలు పెట్టటంతో.. వారందరికీ కూడా ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. దగ్గరిలోని మీ-సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ కల్పించింది. దీంతో.. జనాలంతా మీ-సేవా కేంద్రాలకు క్యూ కట్టారు.



## రాహుల్ తో రేవంత్ భేటీ...


### తెలంగాణలో భారీ బహిరంగ సభ?

రాష్ట్రంలో కులగణనను సమగ్రంగా నిర్వహించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై కీలకంగా చర్చించినట్లు సీఎం రేవంత్ వెల్లడించారు.

2లో

## నేటిమాట

“ఒక్క వ్యక్తి బలహీనత దేశాన్ని పడగొట్టగలదు, అలాగే ఒక వ్యక్తి ధైర్యం దేశాన్ని రక్షించగలదు!”



-ఛత్రపతి శివాజీ

## తెలంగాణ కాంగ్రెస్ ఇన్ చార్జిని ఎందుకు మార్చారు?



కాంగ్రెస్ దేశంలో అధికారంలో ఉన్నది మూడు రాష్ట్రాల్లోనే. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ. ఈ మూడు రాష్ట్రాలే ఇప్పుడు తెలంగాణను సాకుతున్నాయి. దీంతో ఈ రాష్ట్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలో పార్టీని గాడిన పెట్టేందుకు ఇన్‌చార్జిలను నియమించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి తెలంగాణ ఇన్‌చార్జిగా దీపాదాస్ మున్షీ ఉన్నారు. రెండేళ్లు పార్టీ బాధ్యలు చూస్తూ ఏఐసీసీ కి అనుసంధాన కర్తగా పనిచేశారు. తాజాగా ఆమెస్థానంలో మీనాక్షి నటరాజన్‌ను ఏఐసీసీ నియమించింది.

## ఆ పెన్ డ్రైవ్‌లో పవన్ జాతకం..


### లక్ష్మీ సంచలన ఆరోపణ



జనసేన నేత కిరణ్ రాయల్ పై లక్ష్మీ సంచలన కామెంట్స్ చేశారు. ఇటీవల కిరణ్ రాయల్ పై లక్ష్మీ అనే మహిళ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కిరణ్ రాయల్ కూడా వాటిని ఖండించారు. అయితే లక్ష్మీని ఇటీవల జైపూర్ పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టు బెయిల్ ఇచ్చిన అనంతరం విడుదల చేశారు. శనివారం తిరుపతికి వచ్చిన లక్ష్మీ మీడియా సమావేశం నిర్వహించి సంచలన విషయాలు వెల్లడించారు. ఈ ఆరోపణలు ప్రస్తుతం ఏపీలో దుమారం రేపుతున్నాయి.

## వైన్ షాప్ సిండికేట్ దందా..

- పచ్చని పల్లెలో బెల్ట్ జోరు ...
- గ్రామాలలో బార్లను తలపిస్తున్న బెల్టుషాపులు ..
- ఆదాయమే లక్ష్యంగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం ..
- గుల్ల అవుతున్న మద్యం ప్రియులు జేబులు ...
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు ...



# మోదీ కులంపై వివాదం..

## సంచలన వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్,15 ఫిబ్రవరి ( క్రాంతిన్యూస్ ): అదే విధంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో అత్యున్నత ధర్మాసనం ఇచ్చే తీర్పు కోసం వేచిచూస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కంటే ముందే, కేటీఆర్ ఏదేదో చెప్తున్నాడని కూడా మండిపడ్డారు. సభిత ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ లు ఏ పార్టీలో గెలిచి, ఏ పార్టీలో మంత్రులుగా పనిచేశారో గుర్తు చేసుకొవాలన్నారు. ప్రధానిని కించపరిచేలా తాను ఎక్కడ కూడా మాట్లాడలేదని, ఉన్నది ఉన్నట్టుగానే చెప్పానని క్లారిటీ ఇచ్చారు. బీజేపీ నేతలు సైతం అదే విషయాన్ని ఒప్పుకున్నారన్నారు.తాను కొందరికి నచ్చకపోతే.. అది తన సమస్య కాదన్నారు. కానీ నా పని నేను చేస్తున్నని చెప్పారు. తనను ఎవరు కూడా ప్రశ్నించే పరిస్థితి తెచ్చుకొనని అన్నారు. కాంగ్రెస్ తరపున ప్రజలకు హామీ ఇచ్చింది నేను.. అమలు చెయ్యక పోతే అడిగేది నన్నే.. అంటూ స్పష్టం చేశారు.కొంతమంది నాపై అబద్ధపు ప్రచారాలు చేసి , పైశాచిక ఆనందం పొందుతున్నారని అలాంటి ఆరోపణల్ని పట్టించుకొనేది లేదని క్లారిటీ ఇచ్చారు. క్యాబినెట్ విస్తరణ నా ఒక్కడి నిర్ణయం కాదని.. కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలు అందరు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలు చేసిన తలొగ్గేది లేదన్నారు. పీసీసీ కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణ తదితర అంశాలపై కొందరు పైశాచిక ఆనందం కోసం ఊహాగానాలు వ్యాప్తి చేస్తున్నారని, అంతిమంగా కాంగ్రెస్ హైకమాండ్ తీసుకునే నిర్ణయం ప్రకారం ముందుకు వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీది ఏ కులం..

## కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

పుట్టుకతో ఉన్నత కులం అయినటప్పటికీ, 2001లో ముఖ్యమంత్రి అయ్యాక ఆయన కులాన్ని బీసీ కులాల్లో కలుపుకొన్నారని తెలంగాణ ముఖ్యమంత్రి ఓ సభలో వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్?పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సోషల్ మీడియా ప్లాట్?ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా రియాక్ట్ అయ్యారు. 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మరో డైవర్షన్ పాలిటిక్స్?కు తెరలేపిందని.. ఇందులో భాగంగానే సీఎం రేవంత్ ప్రధానమంత్రి కులంపై చర్చ మొదలు పెట్టారని ఫైర్ అయ్యారు.

ప్రధానిపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నేత బండి సంజయ్ ఖండించారు. పుట్టగానే మనిషికి కులం పేరు పెడతామా? అని బండి సంజయ్.. ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. సంచలనం కొరకే ప్రధానిపై రేవంత్ వ్యాఖ్యలు చేశారని దుయ్యబట్టారు. బాధ్యతాయుత పదవిలో ఉండి రేవంత్ ఇలాంటి మాటలు మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. మోడీ కులాన్ని బీసీలో చేర్చింది కాంగ్రెస్సే అని బండి సంజయ్ అన్నారు. ఆ సమయంలో రేవంత్ రెడ్డి టీడీపీలో ఉన్నారు కనుక ఈ విషయం ఆయనకు తెలియదు అనుకుంటా అని సెటైర్లు వేశారు.

ప్రధాని మోడీపై సీఎం చేసిన పరిశోధన పూర్తిగా విఫలమైందని.. ఎందుకంటే 1994లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రధానమంత్రి మోడీ కులాన్ని ఓబీసీగా జాబితాలో చేర్చారని.. ఈ విషయాన్ని రేవంత్ రెడ్డి మర్చిపోయారని ఎద్దేవా చేశారు. మోడీ కులంపై మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ కులానికి చెందినవారు..? అతని మతం ఏమిటి..? చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీతో పాటు ఆయన కులం మతం సీఎంకి కూడా తెలువదా అని అన్నారు. రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ జహంగీర్ గాంధీ.

రాహుల్‌ది ఏ కులం..? ఏ మతం..? ఏ దేశం..? దీనిపై 10 జనపథ్‌లో చర్చ జరగాలి అని బండి సంజయ్ అన్నారు. సోనియా క్రిస్టియన్, ఇటలీ దేశస్తురాలు అయినప్పుడు.. ఆమె కొడుకు ఏ దేశస్థుడు అవుతాడు..? రాహుల్ గాంధీది ఏ కులమని మీరు ప్రోత్సహిస్తున్నారు..? రాహుల్‌కి కులం, మతం, దేశం, జాతి లేదు. రేవంత్ దీనికేం ఏం సమాధానం ఇస్తారు..? అని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. మోదీని బీసీగా దేశమంతా గుర్తించిందని బండి సంజయ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను డైవర్ట్ చేసేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఇటువంటి స్టేట్ మెంట్లు ఇస్తున్నారని ఆరోపించారు.

హిందూ సంప్రదాయంలో కులం తండ్రి ద్వారా వస్తుందన్నారు. ఇప్పుడు ఎవరు చట్టపరంగా మతం మార్చుకున్నారో అనే చర్చ చేయాలని అనుకుంటే.. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా 10 జనపథ్ నుంచి చర్చ పెట్టాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ఎంత దృష్టి మరలించాలని ప్రయత్నించిన అది పని చేయదని.. ఇప్పటికే బీజేపీ తరుపున మా నిర్ణయం తేల్చి చెప్పామన్నారు. బీసీ జాబితాలో ముస్లింలను చేరుస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని.. అలాంటి ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు సిద్ధం గా ఉన్నామని బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఆఖరి సీఎం అయినా ఫర్వాలేదు - రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి



తెలంగాణ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా ఎన్నికైన నాటి నుంచి రేవంత్ రెడ్డి ఎన్నడూ కూడా వెనక్కి తగ్గినట్టు మాట్లాడలేదు. తన పరిపాలనపై ఎన్ని విమర్శలు వచ్చినా ఏ మాత్రం లెక్కచేయకుండా ముందుకే వెళ్తున్నారు. ఆమధ్య పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండోసారి కూడా తనే ముఖ్యమంత్రి అవుతానని రేవంత్ రెడ్డి ప్రకటించారు. తనకంటూ ఒక లాంగ్ విజన్ ఉందని.. తెలంగాణ అభివృద్ధికి కంకణబద్ధుడిగా ఉంటానని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తనపై ఎన్ని విమర్శలు చేసినా.. ఎన్ని రకాలుగా ఆరోపణలు చేసినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. తాను సింగల్ టర్మ్ సీఎం గా ఉండడానికి రాలేదని.. కచ్చితంగా లాంగ్ టర్మ్ సీఎం గానే రికార్డు సృష్టిస్తానని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అయితే కుల గణన విషయంపై ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి పదేపదే ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో.. రేవంత్ రెడ్డి తొలిసారిగా తనలో ఉన్న మనోగతాన్ని వెల్లడించారు.

### చివరి సీఎం అయినా పర్వాలేదు

తను చివరి ముఖ్యమంత్రి అయినా పర్వాలేదు.. బీసీలకు న్యాయం చేసే వెళ్తానని.. తమ పార్టీ నాయకుడు కోరుకున్న విధంగా లక్ష్యాన్ని సాధించి చూపిస్తానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.." ఎవరో ఏదో విమర్శలు చేస్తున్నారు. కుల గణన విషయాన్ని తప్పు పడుతున్నారు. చివరికి మా ప్రభుత్వ లక్ష్యాన్ని శంకిస్తున్నారు. ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. ఎందుకంటే ఇలాంటివి చేసేవారు అధికారం మీద యావతో ఉన్నారు. ఒక ఏడాది కూడా అధికారానికి దూరంగా ఉండలేకపోతున్నారు. రకరకాలుగా విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వాన్ని తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారు. అయినప్పటికీ వెనకడుగు వేసేది లేదు. ఒకవేళ కులగణన ఆధారంగా రాజ్యాంగ ఫలాలు ఇవ్వాల్సి వస్తే.. బహుశా నేనే చివరి సీఎం అవుతానేమో. అలా అయినప్పటికీ నాకు ఇబ్బంది లేదు. కచ్చితంగా మా నాయకుడు కోరుకున్న లక్ష్యాన్ని నెరవేర్చిన వ్యక్తిగా నాకు జీవితకాల సాఫల్యం ఉంటుంది. దశాబ్దాలపాటు అధికారానికి దూరంగా ఉండి.. ప్రభుత్వ ప్రయోజనాలకు దూరంగా ఉన్న వారికి న్యాయం జరిగితే అంతకుమించిన ఆనందం నాకు ఇంకొకటి వేరే ఏముంటుందని" రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి ప్రతికూలంగా స్పందిస్తుండగా.. కాంగ్రెస్ పార్టీ మాత్రం అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తోంది. మరోవైపు ఇటీవల నిర్వహించిన బీసీ గర్జనలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.. ఈ రాష్ట్రానికి చివరి రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ మాత్రమేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా తను చివరి సీఎం అయినా పర్వాలేదని వ్యాఖ్యానిస్తున్నారు.. అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వాస్తవం బోధపడిందా? అందువల్లే ఆయన అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా? అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# రేపు పుస్తెలతాళ్లు లాక్కెళతారా?

మొదటి పేజీ తరువాయి

నిన్న గేటు ఎత్తుకెళ్లారు, నేడు స్టార్టర్లు పీక్కెళ్లారు, ఇక రేపు పుస్తెలతాళ్లు లాక్కెళతారా అని నిలదీశారు. తెలంగాణ ఆడబిడ్డలారా ఈ తెలివితక్కువ కాంగ్రెస్ సర్కారుతో జెర పైలంగా ఉండాలని సూచించారు. అప్పుల పాలైన అన్నదాతలపై ఇంత కక్ష ఎందుకని, కష్టాల్లో ఉన్న కర్షకులపై కాంగ్రెస్‌కు ఇంత కోపమా అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

"నిన్న గేటు ఎత్తుకెళ్లారు, నేడు స్టార్టర్లు పీక్కెళ్లారు.. ఇక రేపు పుస్తెలతాళ్లు లాక్కెళతారా??. తెలంగాణ ఆడబిడ్డలారా.. ఈ తెలివితక్కువ కాంగ్రెస్ సర్కారుతో జెర పైలం. అప్పుల పాలైన అన్నదాతలపై ఇంత కక్షనా? కష్టాల్లో ఉన్న కర్షకులపై కాంగ్రెస్ కు ఇంత కోపమా??

సాగు నీళ్లిచ్చే సోయి లేదు.. పంటలు ఎండుతున్నా పట్టింపు లేదు. కానీ.. రైతులు అష్టకష్టాలు పడుతుంటే వేధింపులా?. బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దుచేసిన నీటితీరువాను.. ఐదేళ్ల తరువాత ఇప్పుడు వసూళ్లకు తెగబడతారా??. తెలంగాణ రైతులంటే అంత అలుసైపోయారా?. ఓట్లనాడు ప్రేమ ఒలకబోసి గద్దెనెక్కాక నరకం చూపిస్తారా??.

2 లక్షల రుణమాఫీ సక్కగ చేయని సన్నాసులు ఇంత దారుణానికి ఒడిగడతారా??. రైతు భరోసాకు సవాలక్ష ఆంక్షలు పెట్టి.. రైతన్నను సంక్షోభంలోకి నెట్టింది మీరు కాదా??. పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టి.. మళ్లీ అప్పులపాలయ్యేలా చేసిన పాపం మీది కాదా కాదా!!.

ఆత్మగౌరవంతో బతికే అన్నదాతలపై ఈ వరుస దాష్టీకాలేంటి?. మీరు చేసిన పాపాలకు బక్కచిక్కిన రైతులపై ఈ దుర్మార్గాలేంటి?. వ్యవసాయరంగంలో సంతోషం ఆనవాళ్లు చెరిపేసి.. సమైక్యరాష్ట్రంలో పీడించిన సంక్షోభం ఆనవాళ్లను తెలంగాణ నేలపై మళ్లీ తెస్తామంటే రైతాంగం సహించదు. సంఘటితంగా పోరాడుతది..! సీఎంకు బుద్ధి చెబుతది..!!" అంటూ ట్వీట్ చేశారు.

# కొత్త రేషన్ కార్డుల జారీ ఇప్పట్లో లేనట్టే

మొదటి పేజీ తరువాయి

అయితే.. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని.. ఎప్పుడైనా ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం పదే పదే చెప్తోంది. అయితే.. ప్రకటించిన జాబితాల్లోని అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తారు..? ఇప్పుడు కొత్తగా దరఖాస్తు చేసుకుంటున్న వారికి ఎప్పుడిస్తారన్న అంశంపై ప్రజల్లో గందరగోళం ఏర్పడింది. ఈ క్రమంలో.. కొత్త రేషన్ కార్డుల జారీపై బిగ్ అప్డేట్ వచ్చింది. అయితే.. ప్రస్తుతం దరఖాస్తున్న చేసుకుంటున్న అప్లికేషన్లను పరిశీలించి.. వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి.. అర్హులా కాదా అని నిర్ధారించి.. అప్పుడు జారీ చేయాల్సి ఉంటుంది కాబట్టి.. ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.అయితే.. ఇప్పటికే ప్రకటించిన జాబితాల్లోని అర్హులకు కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు పెద్దగా పని లేకపోయినప్పటికీ.. మరింత సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎందుకంటే.. ప్రస్తుతం తెలంగాణలోని పలు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరగనుండగా... వరంగల్- ఖమ్మం- నల్గొండ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. అయితే.. ఈ రెండు స్థానాలకు ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా.. ఆయా జిల్లాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. దీంతో.. ఈ కోడ్ ముగిసేవరకు రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోనుంది. దీంతో.. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్ ముగిసిన తర్వాతే.. కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ మొదలవనుందని తెలుస్తోంది.అయితే.. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ మాత్రం కొనసాగుతుందని ప్రభుత్వం చెప్తోంది. కొత్త రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని.. మీ-సేవా కేంద్రాల్లో అప్లై చేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం చెప్తోంది.

# నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఉద్రిక్తత

## సెక్యూరిటీ అధికారిపై దాడి

మొదటి పేజీ తరువాయి

నిజామాబాద్ జిల్లా పసుపు మార్కెట్ యార్డులో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యార్డుకు చెందిన సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్‌పై కార్మికులు దాడి చేశారు. తమపై పసుపు దొంగతనం ఆరోపణలు చేస్తున్నారంటూ శ్రీనివాస్‌పై కార్మికులు మండిపడ్డారు. తమపై పసుపు దొంగతనం ఆరోపణలను నిరసిస్తూ పసుపు కాంటాలు నిలిపివేశారు. ఆనంతరం ఆందోళనకు దిగారు. యార్డులో వివిధ సంఘాలకు చెందిన పసుపు కార్మికులు యార్డు ఛైర్మన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా దొంగతనం ఆరోపణలపై ఛైర్మన్‌ను నిలదీశారు. కార్మికులంతా పెద్దఎత్తున ధర్నా చేపట్టడంతో సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన యార్డుకు చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో మొహరించిన పోలీసులు మార్కట్ లో పరిస్థితి అదుపుతప్పకుండా ఆందోళన కారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్‌ను పోలీసులు అక్కడినుంచి తరలించే ప్రయత్నం చేశారు.



మార్కెట్ యార్డులో పెద్ద ఎత్తున ధర్నాకు దిగిన కార్మికులు పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. పోలీసు వాహనంలో ఉన్న శ్రీనివాస్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించారు. అతన్ని బయటకు లాగి కొట్టే ప్రయత్నం చేశారు. కార్మికులు పెద్ద సంఖ్యలో ఉండడంతో వారిని అదుపు చేయడం పోలీసులకు భారంగా మారింది. అయితే పోలీస్ వాహనాన్ని అడ్డుకోవడంతో మరింత ఉద్రిక్తత చెలరేగింది. అయితే పోలీసులు తమ కారును అక్కడ్నుంచి వేగంగా పోనిచ్చారు. కార్మికుల ధర్నాతో మార్కెట్ లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ధర్నా నేపథ్యంలో పసుపు క్రయవిక్రయాలు ఆగిపోయాయి. పసుపు కాంటాలు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కొనుగొళ్లు ప్రారంభించాలని కోరుతున్నారు. గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో మార్కెట్ యార్డులో పోలీసులు భారీగా మోహరించారు. అయితే కార్మికుల ఆందోళనను విరమింప చేయడానికి మార్కెట్ కమిటి ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా కార్మికుల పట్ల దురుసుగా ప్రయత్నించిన సెక్యూరిటీ అధికారిని విధుల్లోంచి తొలకించాలని కార్మికులు డిమాండ్ చేయడంతో ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టారు.

# తెలంగాణను నీటి సంక్షోభంలోకి నెట్టేసిన కాంగ్రెస్ సర్కారు

తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలతో నీటి సంక్షోభంలోకి నెట్టేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గణనీయంగా పడిపోయిన భూగర్భ జలమట్టంపై శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోనే తెలంగాణను భూగర్భ జలాల సంరక్షణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదర్శంగా నిలిపితే.. కాంగ్రెస్ పాలన వైఫల్యంతో భూగర్భ జలాలు మళ్లీ పాతాళానికి చేరాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లలో భూగర్భ జలాలు 56 శాతం పెరిగాయన్నారు. మిషన్ కాకతీయ ద్వారా 27 వేలకు పైగా చెరువులను పునరుద్దరించడంతో 15 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా దక్కిందని. 8.93 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపులేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు మీటర్లకు పైగా భూగర్భ జలమట్టం పడిపోయిందన్నారు. యాదాద్రి జిల్లాలో 2.71 మీటర్లు, రంగారెడ్డి, మహబూబ్ నగర్ సహా ఇతర జిల్లాల్లోనూ భూగర్భ జల మట్టం భారీగా తగ్గిపోయిందన్నారు. 120 కి.మీ. పొడవునా గోదావరి నది పూర్తిగా ఎండిపోయిందని.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ వైఫల్యమే దీనికి కారణమన్నారు. మేడిగడ్డతో పాటు కాళేశ్వరం బ్యారేజీలు రాష్ట్రానికి నీటి భద్రత కల్పిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో ఇప్పుడు తాగునీటికి నీళ్లు అందని దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటిమట్టాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని.. ప్రభుత్వం ఇకనైనా మేల్కొనకపోతే రాబోయే రోజుల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# రాహుల్ తో రేవంత్ భేటీ...

## తెలంగాణలో భారీ బహిరంగ సభ?

మొదటి పేజీ తరువాయి

### కులగణన ఎందుకు కీలకం?

"కులగణన ద్వారా ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తున్నాం. తెలంగాణ ఈ విషయంలో దేశానికి రోల్ మోడల్. రాహుల్ గాంధీ చెప్పిన దానిని పూర్తిగా అమలు చేస్తాను. ఇప్పటివరకు నిర్వహించిన కులగణన ఆధారంగా భవిష్యత్తులో కమిటీ వేసి, ప్రజలకు మరింతగా సంక్షేమ పథకాలు ఎలా అందించాలో నిర్ణయిస్తాం" అని సీఎం రేవంత్ తెలిపారు.

### మోడీ బీసీ కాదా? రేవంత్ వివరణ

ప్రధాని నరేంద్ర మోదీ పుట్టుకతో బీసీ కాదని, అందుకే ఆయన బీసీల పట్ల చిత్తశుద్ధిగా వ్యవహరించడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. "మోదీని వ్యక్తిగతంగా తిట్టలేదు. ఆయన బీసీ కాదని మాత్రమే చెప్పాను. నిజంగా బీసీల పట్ల మోదీకి చిత్తశుద్ధి ఉంటే, జనగణనలో కులగణనను చేపట్టాలి" అని స్పష్టం చేశారు. అయితే బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఈ వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపించారు.

తాము పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో కోర్టు ఉత్తర్వుల ప్రకారం ముందుకు సాగుతామని సీఎం తెలిపారు. అలాగే, రాహుల్ గాంధీతో తనకు ఎలాంటి విభేదాలు లేవని, విపక్షాలు కావాలని ఆ మాయాజాలాన్ని సృష్టిస్తున్నాయని ఖండించారు. "రాహుల్ గాంధీ గైడెన్స్‌నే నేను అనుసరిస్తున్నా. ఆయన ఎజెండాను అమలు చేయడమే నా బాధ్యత" అని స్పష్టం చేశారు.

తెలంగాణలో బీసీల హక్కులను కాపాడేందుకు కులగణన కీలకంగా మారిందని సీఎం పేర్కొన్నారు. "దేశంలో ఎవరూ చేయలేని విధంగా బీసీ కులగణనను పూర్తి చేశాం. మిస్ అయినవారికి మరో అవకాశం కల్పిస్తున్నాం. తాము నిర్వహించిన సర్వేలో ప్రజల స్వయంగా ఇచ్చిన వివరాలే నమోదు చేశాం. అందులో తప్పులుంటే నిరూపించండి" అని విపక్షాలకు సవాల్ విసిరారు.

తెలంగాణ ప్రభుత్వం 42% బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంట్‌కి పంపనుందని సీఎం రేవంత్ తెలిపారు. "రాజకీయ జోక్యానికి తావులేకుండా కమిషన్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నాం. కేసీఆర్ ప్రభుత్వం చేసిన కుటుంబ సర్వేలో బీసీలను 51%గా చూపించగా, తాము హిందూ ముస్లిం బీసీలను కలిపి 56%గా నమోదు చేశాం" అని వివరించారు.

### కేసీఆర్ సర్వేలో తప్పులు

కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వేలో ఎస్సీలను 82 కులాలుగా చూపారని, అయితే వాస్తవానికి 59 కులాలే ఉన్నాయని సీఎం అన్నారు. "స్పెల్లింగ్ తప్పుగా నమోదు చేసినా, కొత్త కులాలుగా చూపించారు. ఇలాంటి తప్పులేమీ మా కులగణనలో లేవు" అని స్పష్టం చేశారు.

### కేబినెట్ విస్తరణపై స్పష్టత

సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో భేటీలో కేబినెట్ విస్తరణ లేదా పీసీసీ కార్యవర్గంపై చర్చించలేదని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామని తెలిపారు.

# తెలంగాణ కాంగ్రెస్ ఇన్ చార్జిని ఎందుకు మార్చారు?

మొదటి పేజీ తరువాయి

ఈమేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని పార్టీ నేత కేసీ.వేణుగోపాల్ ప్రకటించారు. రాహల్‌గాంధీ టీంలో కీలక సభ్యురాలిగా ఉన్న మీనాక్షి నటరాజన్, త్వరలో తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరిస్తారు.

### మీనాక్షి ప్రస్థానం ఇదీ..

మీనాక్షి నటరాజన్ సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్. కిందిస్థాయి నుంచే పార్టీ కోసం పనిచేస్తూ వచ్చారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, ఏఐసీసీలో కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2009లో మధ్యప్రదేశ్‌లోని మంద్‌సౌర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. అయితే తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో ఓడిపోయారు. అయినా రాహుల్‌గాంధీకి అత్యంత విశ్వసనీయ నేతల్లో ఒకరిగా ఉన్నారు.

### అసలు ఎందుకు మార్చారు..

తెలంగాణ ఇన్‌చార్జిగా ఉన్న కేరళకు చెందిన దీపాదాస్ మున్షీని మార్చడం ఇప్పుడు టీ కాంగ్రెస్‌లో చర్చనీయాంశమైంది. ఆమె కేరళతోపాటు, తెలంగాణకు ఇన్‌చార్జిగా ఉన్నారు. కేరళపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు సీనియర్లను కలవడం లేదు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. దీంతో చాలా మంది దీపాదాస్ పనితీరుపై అసంతృప్తితో ఉన్నారు. ఈమేరకు కొందరు అధిష్టానానికి ఫిర్యాదులు కూడా చేశారు. అన్ని రకాలుగా ఆలోచనలు చేసిన అధిష్టానం పార్టీ సీనియర్ల అభిప్రాయం మేరకు కొత్త ఇన్‌చార్జిని నియమించింది. దీంతో దీపాదాస్ మున్షీ ఇక కేరళకే పరిమితం చేసింది.

### ఇతర రాష్ట్రాల్లోనూ మార్పులు

తెలంగాణతోపాటు ఏఐసీసీ పలు రాష్ట్రాలకు కూడా కొత్త ఇన్‌చార్జిలను నియమించింది. హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, జార?ండ్, మణిపూర్, బిహార్ రాష్ట్రాలకు కూడా కొత్త ఇన్‌చార్జ్‌లను నియమించింది. పంజాబ్, జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్‌లకు కొత్త జనరల్ సెక్రెటరీలను నియమించింది. తాజా నియామకాలతో ఆయా రాష్ట్రాల్లో పార్టీ మరింత బలపడుతుందని అధిష్టానం భావిస్తోంది.

# ఆ పెన్ డ్రైవ్ లో పవన్ జాతకం..

## లక్ష్మీ సంచలన ఆరోపణ

లక్ష్మీ మాట్లాడుతూ.. తనను దౌర్జన్యంగా జైపూర్ పోలీసులు అరెస్ట్ చేశారని, లోకల్ పోలీసులు లేకుండా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఒక వెధవను వెధవా అని నిరూపించేందుకు ఇన్ని ఇబ్బందులు ఉంటాయని, తనకు ఇప్పుడే తెలిసిందన్నారు. తనను అరెస్ట్ చేసి జైపూర్ పోలీసులు కోర్టు ముందు హాజరుపరిస్తే, 41 ఏ నోటీసులు ఇచ్చారా అంటూ జడ్జి అడిగిన ప్రశ్నకు పోలీసుల వద్ద సమాధానం లేదన్నారు. తనను జైపూర్ పోలీసుల ద్వారా కిడ్నాప్ చేయాలని ప్రయత్నించారని ఆమె విమర్శించారు.

వైసీపీ నాయకుల మద్దతు ఉందని కిరణ్ రాయల్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన సమయంలో తనకు ఉన్న ఏకైక ప్రాపర్టీని అమ్ముకొని బెయిల్ పొందానన్నారు. అబ్దుల్ ఘనీ తన గురించి చెబుతున్న ఆరోపణల్లో నిజం లేదని, ఆటోడ్రైవర్ కు ముందు కిరణ్ రాయల్ అనుచరుడిగా ఘనీ ఉన్నట్లు ఆమె తెలిపారు. కిరణ్ రాయల్ ఏమి చెప్పినా చెల్లిపోతుందని అనుకుంటున్నాడని, ఇక్కడ ఎవరూ అంత అమాయకులు లేరన్నారు.

తనతో కిరణ్ రాయల్ సన్నిహితంగా ఉన్న సమయంలో చాలా విషయాలు వెల్లడించినట్లు లక్ష్మీ అన్నారు. పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ తన వెంట ఉన్నారని ఎప్పుడూ చెప్పేవాడన్నారు. తన వద్ద పవన్ రహస్య జీవితానికి సంబంధించిన పెన్ డ్రైవ్ ఉందని, తనను పవన్ ఏమి చేయలేడని చాలా సార్లు చెప్పినట్లు ఆమె ఆరోపించారు. మాజీ మంత్రి రోజా దగ్గరి బంధువును కూడా కిరణ్ రాయల్ ట్రాప్ చేశారని, అవసరానికి వాడుకొని అవసరం తీరాక, ఆమెపై దాడి చేసిన చరిత్ర కిరణ్ రాయల్ కే దక్కుతుందని సంచలన కామెంట్స్ చేశారు.ఆ కారణం వల్లే వైసీపీ ప్రభుత్వ హయాంలో కిరణ్ రాయల్ ను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన కారణం వేరైతే, పార్టీ కోసం అంటూ కిరణ్ బిల్డప్ ఇచ్చారన్నారు. తనకు టైమ్ వస్తే పవన్ నే బెదిరిస్తానని, నువ్వెంత అంటూ కిరణ్ రాయల్ చాలా సార్లు బెదిరించినట్లు లక్ష్మీ చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. జైపూర్ నుండి వచ్చిన లక్ష్మీ.. మీడియా సమావేశం ఏర్పాటు చేసిన కామెంట్స్ ఇప్పుడు ఏపీలో హాట్ టాపిక్ గా మారాయి. ఇంతకు లక్ష్మీ చేసిన ఆరోపణలు నిజమేనా? కిరణ్ రాయల్ వద్ద పెన్ డ్రైవ్ ఉన్న మాట వాస్తవమేనా? ఆ పెన్ డ్రైవ్ లో ఏముందన్నది ఇప్పుడు చర్చ సాగుతోంది. ఈ అనుమానాలకు తెర పడాలంటే లక్ష్మీ చేసిన ఆరోపణలకు కిరణ్ రాయల్ స్పందించాల్సి ఉంది.

క్రాంతి తెలంగాణ
epaper.krtvnews.com

# వైన్ షాప్ సిండికేట్ దందా..

- పచ్చని పల్లెల్లో బెల్ట్ జోరు ...
- గ్రామాలలో బార్లను తలపిస్తున్న బెల్టుషాపులు ..
- ఆదాయమే లక్ష్యంగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం ..
- గుల్ల అవుతున్న మద్యం ప్రియులు జేబులు ...
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు ...



**క్రాంతి దినపత్రిక // నూగురు వెంకటాపురం ( ఫిబ్రవరి 15 ) :**

మండల కేంద్రం తో పాటు పరిసర ప్రాంతం మరియు గ్రామాల్లో గల్లీ కో బెల్ట్ షాపు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. అయినా కూడా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాకు ఏమీ సంబంధం లేనట్టుగా, చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ వల్ల రిటైల్ మద్యం షాపుల వ్యాపారాలకు అడ్డగోలుగా లాభాలు వస్తున్నాయి.

### పల్లెల్లో బెల్టుషాపులు దందా జోరుగా సాగుతోంది ...

పల్లెలు, మారుమూల గ్రామాల్లో రాత్రింబవళ్లు మత్తులో జోగుతున్నయి. గ్రామాలు, గుడాలు పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు వెలుస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు వెంకటాపురం వైన్ షాప్ సిండికేట్ వారు. అనేకమంది బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధి పాలు అవుతున్నాయి మండల లో ప్రధాన కేంద్రం గా అధికార వైన్ షాప్ కు నిత్యం వచ్చే మద్యం ప్రియులకు ఎమ్మార్పీ ధరల కు అమ్మకాలు చేయకుండా బెల్ట్ షాప్ లకి 40 /రూ. ఎక్కువ రేట్ కి అమ్ముతున్నారు. సిండికేట్ కారణంతో విచ్చలవిడిగా పెరిగిపోతున్న బెల్ట్ షాప్ నిర్వాహకులు వల్ల క్వాటర్ 40/రూ. లు హాఫ్ పై 70/రూ. లు ఫుల్ పై కనీసం 120/రూ. లు బీర్ పై 50/రూ. లు అదనంగా వసూలు చేస్తున్నారు. వైన్ షాపుల్లో లేని బ్రాండ్లు బెల్ట్ షాప్ లో ఉండడం గమనార్హం. ప్రతి ఒక గ్రామంలో వీధి వీధికి బెల్ట్ షాప్ వెలవటంతో ఆంతర్యమేమిటో అర్థంకాని పరిస్థితి. ఒక్కమాటలో చెప్పాలంటే సంబంధిత అధికారులు, కేవలం గుడుంబా స్థావరాల పై దృష్టి పెట్టడంతో పరోక్షంగా బెల్టుషాపులు నిర్వాహకులను పెంచి పోషించినట్లు%శీ%దని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మండలం లో మొత్తం గ్రామ పంచాయతీలు 18 ఉండగా మొత్తం గ్రామ పంచాయతీల్లో సుమారు 300 పైగా బెల్టుషాపులు నిర్వాహకులు బెల్టుషాపులు నడుపుతున్నారు. మండల కేంద్రాల్లో రాత్రి సమయంలో మద్యం దొరకదు కానీ గ్రామాలలో ఏ మధ్య రాత్రి అయిన బెల్టు షాపు తలుపు తట్టిన చాలు (ఏ టీ ఎం) లాగ కావలసిన మద్యం ప్రత్యక్షం అవుతుంది. ధర ఎంతైనా పర్వాలేదు అన్నట్లుగా మద్యం ప్రియులు వ్యవహారం ఉంది.

### పెడదారి పడుతున్న యువత ...

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహణతో ప్రధానంగా యువత పెడదారిలో ప్రయాణిస్తుంది. ఎంతో విలువైన తమ భవిష్యత్తును అబాసుపాలు చేసుకుంటున్నారు. గ్రామాల్లో రాత్రి మద్యం అమ్మకాలు చేయడం వల్ల యువత మద్యం మత్తులో ఏం చేస్తున్నారో అర్థం కాకుండా అయిపోయింది. కొన్ని సందర్భాల్లో తమ విలువైన ప్రాణాలను కూడా యువత పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి.

### పేరుకు కిరాణం.. అమ్మేది మద్యం ..

మండలంలో పలు గ్రామాల్లో ఎక్కువమంది పేరు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిజ్ లు పెట్టుకుని మరీ మద్యం విక్రయిస్తున్నారు. కిరాణం దుకాణం దగ్గర మద్యం సేవించి ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్టుషాపులు కారణంగా మద్యం ఏరులై పారుతుంది.పచ్చని సంసారంలో మద్యం చిచ్చు

విచ్చలవిడిగా గ్రామాల్లో దొరుకుతున్న మద్యం పచ్చని సంసారంలో చిచ్చు పెడుతోంది. దీంతో పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వేచిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో భార్య భర్తలు గొడవలు పడి మద్యం మత్తులో క్షణికావేశం లో ఏమి జరిగింది అనే తెలుసుకునే లోపు కుటుంబంలో ఉన్న వ్యక్తులు అనాథలుగా మారిపోతున్నారు.

### పట్టించుకోని అధికారులు గ్రామాల్లో మద్యం అమ్మకాలు

సిండికేట్ గా మారడం తో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. హెూటల్ లు కిరాణా షాపులు, బెల్టు షాపు గా తయారవుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు లాభార్జన దేంగా గ్రామీణ ప్రాంతాల వారికి విక్రయిస్తున్నారు. మద్యం షాపులు రహదారుల పక్కన నిర్వహించరాదని అధికారికంగా వెల్లడించినప్పటికి గ్రామాల్లో రోడ్డు పక్కన దర్జాగా మద్యం విక్రయిన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి ఇకనైనా ఎక్సైజ్ శాఖ తో పాటు పోలీస్ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గ్రామాలలో, తండాలలో పట్టణాలలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను సీజ్ చేయాలని, తండాలలో, గ్రామాలలో, ప్రజలు, యువత మద్యానికి బానిస కాకుండా కఠినమైన ఆంక్షలు విధించాలని సామాన్య ప్రజలు వేడుకుంటున్నారు..

## పారుతున్న బిక్కేరు వాగును సందర్శించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



మోత్కూర్, ఫిబ్రవరి 15 (క్రాంతి న్యూస్):మోత్కూరు మండల కేంద్రంలో గలగలా పారుతున్న బిక్కేరు వాగును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించారు.గుండాల మండలం నుండి మోత్కూరు మీదుగా ఆత్మకూరు ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న సందర్భంలో బిక్కేరు వాగు వద్ద రైతులు ఆనందంగా వీక్షిస్తుండగా, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వారిని చూసి ఆగి మాట్లాడారు.రైతులు హర్షం వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు సార్లు ఈ వాగు ద్వారా తమ పంట పొలాలకు, గ్రామాల సమీప ప్రాంతాలకు నీటిని అందించినందుకు బీర్ల అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత



మోత్కూర్, ఫిబ్రవరి 15 (క్రాంతి న్యూస్):మోత్కూరు మండలం అనాజిపురం గ్రామానికి చెందిన చుక్క బిక్షపతి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఈసీ మెంబర్ డాక్టర్ కోకభిక్షం శనివారం బిక్షపతి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అయన కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీ యాదయ్య, వెంకటయ్య, నాయకులు కొల్లు శంకర్, సత్యనారాయణ, రమేష్, శేఖర్ రెడ్డి, బర్రె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ కృషి ఎనలేనిది

**: ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి**



నర్సాపూర్, సంత్ సేవాలాల్ గిరిజనుల అభివృద్ధికి, వారి చైతన్యానికి ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి వెల్లడించారు. శనివారం నర్సాపూర్- హైదరాబాద్ ప్రధాన రోడ్డులోని సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ఆయన 286వ జయంతిని గిరిజనులు ఘనంగా నిర్వహించారు. వాహనంపై సేవాలాల్ చిత్రపటాన్ని పూలతో అందంగా అలంకరించి బారీ ర్యాలీ నిర్వహించారు.

## మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో

### ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి డిమాండ్**



మోత్కూర్, ఫిబ్రవరి 15 (క్రాంతి న్యూస్):కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల హామీల్లో భాగంగా అన్ని మున్సిపల్ పట్టణాల్లో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి, అమలు చేసి పేదలకు పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి ప్రభుత్వం వద్ద డిమాండ్ చేశారు.శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మోత్కూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీలో ఇంటింటి పర్యటన నిర్వహించి, ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వాన్ని చేర్పించారు.ఈ సందర్భంగా బొల్లు యాదగిరి మాట్లాడుతూ, చిన్న పట్టణాలను మున్సిపల్ పట్టణాలుగా ప్రకటించడం వల్ల అనేక మంది వ్యవసాయ కూలీలు, పేదలు సరైన పనుల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను నిలిపివేసి పేదలను మరింత కష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా మున్సిపల్ పట్టణాల్లో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయకపోవడంపై ప్రశ్నించారు. వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత పట్టణాల్లో పని దొరకక ప్రజలు కుటుంబ పోషణ, ఇంటి అద్దె, విద్య, వైద్యం విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.నాణ్యమైన జీవన ప్రమాణాలను అందుకోవాలంటే పట్టణాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడం తప్పనిసరిగా అవసరమని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తమ బడ్జెట్‌లో రూ. 2.5 లక్షల కోట్లు ఉపాధి హామీ కోసం కేటాయించాలని, సంవత్సరానికి 200 పని దినాలను కల్పించాలని, కనీస రోజువారీ కూలీ రూ. 800గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.రానున్న కాలంలో ఈ లక్ష్యాల సాధన కోసం పేదలను సమీకరించి పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ, పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు కందుకూరు నర్సింహ, సభ్యులు గుండు లక్ష్మి, తీగల్ల సావిత్రి, ఎస్. శోభ, ఎండి. తహరా, నాగమ్మ, వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బహుళ జాతి మొక్కజొన్న కంపెనీల పై

# నిఘా పెట్టండి సార్

- మొక్కజొన్న రైతులకు నష్ట పరిహారంగా లక్ష యాభై వేలు చెల్లించాలి..
- వ్యవసాయ శాఖ అధికారుల పైన చర్యలు తీసుకోవాలి..
- ఏ ఎన్ యస్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహమూర్తి ...



**క్రాంతి దినపత్రిక // నూగురు వెంకటాపురం ( ఫిబ్రవరి 15 ) :** ఒప్పంద వ్యవసాయం పేరుతో విదేశీ విత్తన బహుళ జాతి కంపెనీలు ఏజెన్సీ రైతులను నట్టేట ముంచుతున్నాయని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాండ్ మొక్కజొన్న వ్యవసాయం అంటే కంపెనికి రైతులకు మధ్య జరిగే ఒప్పందం అన్నారు. కానీ రైతులకు కంపెనికి మధ్య దళారులు ఎందుకని నర్సింహా మూర్తి అన్నారు. శనివారం బర్లగూడెం, మొరుమూరు గ్రామపంచాయతీ లకు చెందిన రైతులు ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ని కలిసి తమ గోడు వెళ్ళబుచ్చినట్లు ఆయన మీడియా కు తెలిపారు. ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి మాట్లాడుతూ హై టెక్ మొక్కజొన్న విత్తనాలు రైతులకు ఇచ్చి హై టెక్ మోసం చేశారని అన్నారు. హై టెక్ మొక్కజొన్న విత్తనం 250 ఎకరాల్లో సాగు చేస్తే గింజలు ఎక్కలేదని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎకరానికి నాలుగు నుండి ఐదు టన్నులు దిగుబడి వస్తుందని వెంకటాపురానికి చెందిన ఒక దళారీ విత్తనాలు ఇచ్చినట్లు రైతులు తెలుపుతున్నట్లు వివరించారు. కానీ క్షేత్ర స్థాయిలో ఒక్క టన్ను కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారని తెలిపారు. ఏజెన్సీ ని ఒక ప్రయోగ శాలాగా మార్చి విదేశీ నూతన వంగడాలను ఇక్కడ ప్రయోగం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త వంగడాలను ఇక్కడ భూముల్లో ట్రైయల్ వేసి సక్సెస్ అయితే మళ్ళీ విదేశాలకి తీసుకుళ్తున్నారని పేర్కొన్నారు. అక్కడి దేశాల్లో ఈ విధంగా భూముల్లో ప్రయోగాలు చేయడం చట్ట విరుద్ధం అన్నారు. ఇండియా లో మారుమూల ప్రాంతాలను ఎంచుకొని విత్తన చట్టాలకు విరుద్ధంగా రైతుల చేత ప్రయోగాలు చేపించడం నేరం అన్నారు. అమాయక రైతులను ప్రతియేటా మొక్కజొన్న పేరుతో కోట్ల రూపాయలకు ముంచు తున్నారన్నారు. డీలర్స్ రైతుల దెగ్గర పట్టా జిరాక్స్ లు, ఆధార్, బ్యాంక్ అకౌంట్స్ తీసుకొని కంపెనీ ఇచ్చే కోట్ల రూపాయలు దండుకుంటున్నారని ధ్వజం మెత్తారు.కమిషన్స్ కోసం విజయంతం గాని విత్తనాలను రైతులకు అంటగట్టి కోట్ల రూపాయలు దళారులు కూడగట్టు కోవడం పైన ఆయన మండిపడ్డారు. విజయవంతం అయిన విత్తనాలు ఇస్తే దళారులకు పెద్దమత్తం లో డబ్బులు రావని ఈ అఘాయిత్యానికి పాల్పడుతున్నట్లు తెలియజేసారు. ఫెయిల్ అయిన విత్తనాల ద్వారా వచ్చే కోట్ల రూపాయల కోసం ఈ దారుణాలకు ఒడిగడుతున్నట్టు వివరంచారు. రైతుల భూములను రైతులకే తెలియకుండా తీసుకొని వాళ్ళ భూముల్లో వాళ్లనే కూలీలను చేసి శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. వ్యవసాయ అధికారులు చేతివాటం చూపెట్టబట్టే దళారులు మోసాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నకిలీ విత్తనాలు తెచ్చి రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తూ ఉంటే వ్యవసాయ అధికారులు నిద్ర పోతున్నారా అని నిలదీశారు. వ్యవసాయ అధికారుల అలసత్వం కారణంగానే కొన్నేళు ్లగా ఈ అక్రమ ఒప్పంద వ్యవసాయం జరుతొందని అన్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, కమిషనర్ ఆపైన సెక్రెటరీ వీళ్లందరి పైన వ్యవసాయ మంత్రి వీళ్లంతా ఏమి చేస్తూ ఉన్నట్టని ప్రశ్నించారు. అధికారుల అలసత్వం కారణంగానే ఇలాంటి మోసాలకు అవకాశం ఏర్పడుతులోందని అన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, నకిలీ ఎరువులు రైతులకు అంటగట్టి రైతుల ఆత్మ హత్యలకు కారకులు అవుతున్నారని అన్నారు. ఎద్దేడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు అని అన్నారు. వ్యవసాయ శాఖా అధికారుల పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దివాకర టి ఎస్ ని కోరినారు. ఎకరానికి లక్ష యాభై వేల రూపాయలు నష్టపరిహారం, ఎకరానికి యాభై వేల రూపాయలు భూమి కౌలు కంపెనీ నుండి ఇప్పించాలని నర్సింహా మూర్తి డిమాండ్ చేశారు. నకిలీ విత్తన చట్టం 1966 ప్రకారం కంపెనీ పైన, దళారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ ని కోరినారు. ఎస్సి ఎస్టీ కమిషన్ కి, మానవ హక్కుల కమిషన్ కి, రాష్ట్ర గవర్నర్ కి త్వరలోనే లేఖ రాయనున్నట్లు నర్సింహా మూర్తి ప్రకటించారు. బర్లగూడెం, మొరుమూరు రైతులు పాల్గొన్నారు..

# వంశీ అరెస్టు తర్వాత కొడాలి నాని ప్లేటు మార్చారా?

**-ఈ సంచలన వ్యాఖ్యలు చేశారా?**

**-అరెస్టు, జైలుపై మాట్లాడుతున్న ఈ వీడియో ఎక్కడిది?**

**-వల్లభనేని వంశీ అరెస్టుపై కొడాలి నాని వ్యాఖ్యలు చేశారా?**

వైఎస్సార్‌సీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టు వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను మరోసారి హీటెక్కించింది. దీనిపై టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. అటు సోషల్ మీడియాలోనూ ఇరు పార్టీల అభిమానులు పరస్పరం ఘాటు విమర్శలు చేసుకుంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ క్రమంలో 'వంశీ అరెస్టుతో ప్లేటు మార్చిన కొడాలి నాని' అనే క్యాప్షన్‌తో ఓ వీడియోను (ఇక్కడ, ఇక్కడ %డ% ఇక్కడ) షేర్ చేస్తున్నారు. వైసీపీ నేత కొడాలి నాని.. ఈ వీడియోలో చంద్రబాబు నాయుడుకు అనుకూలంగా వల్లభనేని వంశీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లుగా ఉంది. ఈ వీడియో ఎక్కడిది? ఇందులో వాస్తవం ఎంతో ఇప్పుడు తెలుసుకుందాం..

## క్లెయిమ్ ఏంటి?

వంశీ అరెస్టుతో ప్లేటు మార్చిన కొడాలి నాని. ఎక్స్ (ట్విట్టర్)లో @ Swathireddytdp అనే ఖాతా నుంచి ఫిబ్రవరి 15న 'వల్లభనేని వంశీ అరెస్టుపై కొడాలి నాని రియాక్షన్' అని పేర్కొంటూ ఒక వీడియోను షేర్ చేశారు.

'చంద్రబాబు నాయుడు లాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండాలి. ఆయన ఉంటే బ్రహ్మాండంగా ఉంటుంది. ఆయనపై ఎలాంటి రాజకీయ కక్ష లేదు' అని కొడాలి నాని అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. 'జైలులో దోమలు కుట్టక, రంభ, ఊర్వశి వచ్చి కన్ను కొడతారా ఏంటి ఈయనికి' అని వల్లభనేని వంశీని ఉద్దేశించి కొడాలి నాని అన్నట్లుగా ఈ వీడియోను షేర్ చేస్తున్నారు.

## వాస్తవం ఏంటి?

వల్లభనేని వంశీ అరెస్టుపై గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని స్పందించారా? అనే విషయం కనుగొనేందుకు మేం (సజగ్ బృందం) ఇంటర్నెట్‌లో తగిన కీవర్డ్స్‌తో సెర్చ్ చేశాం. ఈ అంశానికి సంబంధించి ఎలాంటి వార్తా నివేదికలు లభించలేదు. అప్పుడు సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో నుంచి కొన్ని కీఫ్రేమ్స్ సంగ్రహించి గూగుల్ రివర్స్ ఇమేజ్ ద్వారా పరిశీలించగా.. కొడాలి నాని 2023లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన పూర్తి వీడియో లభించింది. సమయం తెలుగు యూట్యూబ్ ఛానల్‌లో ఈ వీడియోను ప్రచురించాం.

2023 సెప్టెంబర్‌లో నాటి ప్రతిపక్ష నేత, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుని 'ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు'లో అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు తరలించారు. అప్పట్లో ఈ వార్త రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, దేశవ్యాప్తంగా సంచలన అంశంగా మారింది. చంద్రబాబు నాయుడు అరెస్టు, రాజమండ్రి జైలులో ఆయనకు కల్పించిన వసతుల గురించి 2023 సెప్టెంబర్ 26న మీడియా ప్రతినిధులతో కొడాలి నాని మాట్లాడారు.

వ్యక్తిగత కక్షతో చంద్రబాబు నాయుడిని అరెస్టు చేశారంటూ ఆరోపణలు వస్తున్నాయంటూ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు కొడాలి నాని బదులిస్తూ.. 'ఆయన (చంద్రబాబు)పై మాకు వ్యక్తిగత కక్ష ఏంలేదు. మేం బతికున్నంత కాలం చంద్రబాబు నాయుడు రాజకీయాల్లో ఉండాలి. మాకు బ్రహ్మాండంగా ఉంటుంది' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. 'టీడీపీ పని అయిపోయింది, కుప్పంలో చంద్రబాబు నాయుడు కూడా గెలవడు' అని కొడాలి నాని అంటూ.. ఈ క్రమంలో పై వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను చంద్రబాబు నాయుడికి అనుకూలంగా కొడాలి నాని మాట్లాడినట్టు ఎడిట్ చేసి షేర్ చేస్తున్నారు.




వల్లభనేని వంశీ వెన్నెపూస నొప్పి, శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్నారని.. జైల్లో ఆయన కింద పడుకుంటున్నారని, బెడ్ కావాలని రిక్వెస్ట్ చేస్తామని ఆయన సతీమణి పంకజశ్రీ.. మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అన్నారు. అయితే, ఈ అంశం పైనా కొడాలి నాని వ్యాఖ్యలు చేసినట్లుగా వీడియో ద్వారా ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి, జైల్లో చంద్రబాబు నాయుడికి తగిన వసతులు కల్పించలేదని, దోమలు కుడుతున్నాయని నాడు (2023లో) చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేసిన ఆరోపణలపై కొడాలి నాని స్పందిస్తూ ఆ వ్యాఖ్యలు (జైల్లో దోమలు కుట్టక, రంభ, ఊర్వశి వచ్చి కన్ను కొడతారా) చేశారు. వీటిని కూడా తప్పుదోవ పట్టించేవిధంగా షేర్ చేస్తున్నారు.

'పూలు జింక ముందు ఊదు, సింహం ముందు ఊదకు' అంటూ నందమూరి బాలకృష్ణ సినిమా డైలాగ్‌ను కూడా చంద్రబాబు నాయుడిని ఉద్దేశించే కొడాలి నాని చెప్పారు. ఈ వ్యాఖ్యలను కూడా వల్లభనేని వంశీని ఉద్దేశించే చేసినట్లు ప్రచారం చేస్తున్నారు.

వల్లభనేని వంశీని విజయవాడ పోలీసులు గురువారం (ఫిబ్రవరి 13) తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేసి, విజయవాడకు తరలించారు. వంశీపై కిడ్నాప్, దాడి, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ సెక్షన్ల కింద విజయవాడలోని పటమట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వంశీకి విజయవాడ 4వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. పోలీసులు ఆయణ్ని విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు.

ముగింపు:

వల్లభనేని వంశీ అరెస్టుపై కొడాలి నాని రియాక్షన్ అంటూ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న వీడియో అవాస్తవం. కొడాలి నాని 2023 సెప్టెంబర్ 26న చంద్రబాబు నాయుడు అరెస్టును ఉద్దేశించి మాట్లాడిన వీడియోను ఎడిట్ చేసి తప్పుదోవ పట్టించేవిధంగా షేర్ చేస్తున్నారు.

# ఇలా మాట్లాడితే ఎలా..

## చింతమనేనిపై చంద్రబాబు సీరియస్..!

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. దెందులూరులోని ఓ వివాహ కార్యక్రమానికి చింతమనేని ప్రభాకర్ ఇటీవల హాజరయ్యారు. అయితే అదే పెళ్లికి వైసీపీ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి కూడా రాగా.. అబ్బయ్య చౌదరి కారు డ్రైవర్‌పై చింతమనేని ప్రభాకర్ బూతులతో విరుచుకుపడిన వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. తన కారు బయటికి వెళ్లకుండా అబ్బయ్య చౌదరి కారును ఆయన డ్రైవర్ అడ్డుగా ఉంచడంతో పాటు.. కారు అడ్డం తీయమని తన కారు డ్రైవర్ అడిగితే అతడు దుర్భాషలాడాడని చింతమనేని ప్రభాకర్ ఆరోపిస్తున్నారు. అందుకే, తాను అబ్బయ్య చౌదరి కారు డ్రైవర్‌పై కోపంతో మాటతూలానని చెబుతున్నారు. అయితే, చింతమనేని ప్రభాకర్ బూతులు తిట్టడం వివాదాస్పదమైంది. దీనిపై మాజీ మంత్రి అంబటి రాంబాబు సైతం స్పందించారు. చింతమనేని ప్రభాకర్ దుర్భాషలాడడమే కాకుండా తిరిగి అబ్బయ్య చౌదరిపై కేసు పెట్టడం విడ్డూరంగా ఉందంటూ వ్యాఖ్యానించారు. కూటమి నేతలకు పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో చింతమనేని ప్రభాకర్‌కు సీఎం చంద్రబాబు నుంచి పిలుపు వచ్చింది. ఈ వివాదం గురించి చంద్రబాబుకు వివరించేందుకు ప్రభాకర్ శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. ఉద్దేశపూర్వకంగా, ఘర్షణకు పురిగొల్పేలా వైసీపీ నేతలు ప్రవర్తించారని చంద్రబాబుకు చింతమేని ప్రభాకర్ వివరించారట. అయితే, చింతమనేని దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం గురించి చంద్రబాబు ఒకింత అసహనం వ్యక్తం చేశారని సమాచారం. "మనం అధికారంలో ఉన్నామని గుర్తుంచుకోండి. సహనంతో వ్యవహరించండి. మీరు ఇలా మాట్లాడితే ఎలా" అని చింతమనేనికి చంద్రబాబు అక్షింతలు వేసినట్టు తెలుస్తోంది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాలని చంద్రబాబు హెచ్చరించినట్లు సమాచారం.



# ఆ ఫోన్ ఎక్కడ.?

**రెండు గంటలు వెతికినా.. నిరాశే!**



గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ మోహన్ అరెస్ట్ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వల్లభనేని వంశీని అక్రమంగా అరెస్ట్ చేశారని వైసీపీ ఆరోపిస్తుండగా.. అన్ని ఆధారాలతోనే అరెస్ట్ చేసినట్లు ప్రభుత్వం చెప్తోంది. ఈ క్రమంలోనే వల్లభనేని వంశీ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గన్నవరం టీడీపీ ఆఫీసులో పనిచేసిన సత్యవర్ధన్ కిడ్నాప్ చేసి దాడి చేసిన కేసులో వంశీని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు.. ఆ తర్వాత విజయవాడకు తరలించి, కోర్టు ఎదుట హాజరుపరిచారు. ప్రస్తుతం వల్లభనేని వంశీ రిమాండ్‌లో ఉన్నారు. అయితే కేసు విచారణలో భాగంగా హైదరాబాద్ రాయదుర్గంలోని వల్లభనేని వంశీ నివాసంలో ఏపీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ కేసులో వల్లభనేని వంశీ ఫోన్ కీలకంగా మారటంతో ఫోన్ పైనే ప్రధానంగా దృష్టి సారించారు.

హైదరాబాద్‌లో వల్లభనేని వంశీని అరెస్ట్ చేసిన సమయంలో పోలీసులకు ఫోన్ లభించలేదు. ఈ నేపథ్యంలో ఈ ఫోన్ కోసం గాలిస్తున్నారు. వల్లభనేని వంశీ మోహన్ ఫోన్ స్వాధీనం చేసుకుంటే కీలకమైన ఆధారాలు లభించే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు వల్లభనేని వంశీ పీఏ ఫోన్‌ను గురువారమే స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. వంశీ ఫోన్ కోసం హైదరాబాద్‌లోని రాయదుర్గంలోని ఆయన నివాసంలో.. రెండు గంటల పాటు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అయినా కూడా ఫోన్ ఎక్కడుందనేదీ తెలుసుకోలేకపోయారు. మరోవైపు అరెస్ట్ సమయంలో వల్లభనేని వంశీ దాదాపు గంట పాటు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే వంశీ ఫోన్ చివరి సారిగా రాయదుర్గంలోని ఆయన నివాసంలోనే ఉన్నట్లు సెల్ ఫోన్ టవర్ సిగ్నల్స్ చూపిస్తున్నాయి. కానీ రెండు గంటలపాటు వెతికినా పోలీసులకు ఫోన్ జాడ తెలియలేదు.

మరోవైపు వల్లభనేని వంశీ మోహన్ ఫోన్ స్వాధీనం కోసం కోర్టు అనుమతి కోరుతూ పోలీసులు విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో ఇప్పటికే పిటిషన్ వేశారు. వల్లభనేని వంశీ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తే మరింత కీలక సమాచారం తెలుస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు వల్లభనేని వంశీ ఎక్కువగా వాట్సప్ కాల్ ద్వారానే మాట్లాడుతుంటారని పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే ఫోన్ ఐపీడీఆర్ వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు సత్యవర్ధన్ కిడ్నాప్ వ్యవహారంలో పోలీసులు ఇప్పటి వరకూ వల్లభనేని వంశీ సహా ఐదుగురిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

## కిరణ్ రాయల్ వివాదం..

## అతను చేసేది అదే..

**మహిళ సంచలన ఆరోపణలు**

జనసేన నేత కిరణ్ రాయల్‌పై తిరుపతి మహిళ సంచలన ఆరోపణలు చేశారు. గత కొన్నిరోజులుగా ఈ వివాదం నడుస్తోంది. అయితే ఆ మహిళను ఆన్ లైన్ చీటింగ్ కేసులో జైపూర్ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బెయిల్ మీద బయటకు వచ్చిన సదరు మహిళ.. శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ రాయల్ మీద సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను రాజస్థాన్ తీసుకెళ్లిన తర్వాత కోర్టులో హాజరుపరిచారని.. ఈ సందర్భంగా న్యాయమూర్తి అనేక ప్రశ్నలు వేశారని సదరు మహిళ తెలిపారు. ఫ్లైట్ టికెట్స్ ఎవరు బుక్ చేశారు, 41సీ నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేశారని జడ్జి ప్రశ్నించినట్లు తెలిపారు. కిరణ్ రాయల్ ఏం వ్యాపారాలు చేస్తున్నాడని ఇంత సంపాదించారన్న మహిళ.. తిరుమల శ్రీవారి దర్శనం టికెట్లు అమ్ముకుంటాడని ఆరోపించారు. ఫోటోలు మార్ఫింగ్ అని చెప్పి తనపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

# ఆయనేమో అలా పిలవమంటారు..

**నాకేమో ఇలా అనడమే ఇష్టం..**

**బాలకృష్ణ గురించి పవన్ కళ్యాణ్**






తలసేమియా బాధితుల సహాయం కోసం ఎన్టీఆర్ ట్రస్టు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మ్యూజికల్ నైట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ ట్రస్టు 28 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఆధ్వర్యంలో యుఫోరియా మ్యూజికల్ నైట్ పేరుతో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే బాలకృష్ణ, నారా లోకేష్ సహా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాలకృష్ణ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే పద్మభూషణ్ అవార్డు వచ్చినందుకు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

"ఆయన నన్ను ప్రేమగా బాలయ్య అని పిలవమంటారు. కానీ ఆయనంటే నాకు అపారమైన గౌరవం. అందుకే సర్ అనే పిలవాలనిపిస్తుంది. ఎవ్వరిని లెక్కచేయని వ్యక్తిత్వం, తను అనుకున్నది బలంగా ముందుకు తీసుకువెళ్లే వ్యక్తి. ఒకటీ రెండు కాదు ఎన్నితరాలు వచ్చినా సరే ప్రేక్షకులను ఆకర్షించే ఆయన నటన ఆనందకరం. మా సోదరుడు బాలకృష్ణ గారు సినిమాల్లోనే కాదు సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారు. ఆ సేవలను గుర్తించే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బాలకృష్ణ గారికి పద్మభూషణ్ అవార్డు ప్రకటించింది. ఆయన మామూలు బాలకృష్ణ కాదు పద్మభూషణ్ బాలకృష్ణగా గుర్తించడం చాలా ఆనందంగా ఉంది. 28 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎన్టీఆర్ ట్రస్టుకు అద్భుతమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నా" అని పవన్ కళ్యాణ్ బాలయ్య గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

మరోవైపు ఇదే కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్టుకు పవన్ కళ్యాణ్ భారీ విరాళం ప్రకటించారు. తలసేమియా బాధితుల సహాయం కోసం ఎన్టీఆర్ ట్రస్టుకు 50 లక్షల రూపాయలు విరాళం ఇస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. త్వరలోనే ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి చేతికి విరాళం తాలూకు చెక్ అందజేస్తానని తెలిపారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన సంగతి తెలిసిందే. రిపబ్లిక్ డే సందర్భంగా వివిధ రంగాలలో సేవలు చేసిన వారికి పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. కళలకు సంబంధించి నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు ప్రకటించింది. దీంతో ఆయనపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# న్యూడ్ కాల్స్ చేశా.. రూ.18 లక్షలు సంపాదించా..

**కానీ ఇప్పుడేమో? ఓ భార్య ఆవేదన**



భర్త అంటే భరించేవాడనే అర్థం. కానీ ఆ భర్త డబ్బుల కోసం అరాచకానికి పాల్పడ్డాడు. భార్యతోనే న్యూడ్ కాల్స్ చేయించి డబ్బులు సంపాదించడం మొదలెట్టాడు. చివరకు ఆ భర్త వేధింపులను తట్టుకోలేక విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి తన బాధలు వెళ్లగక్కింది ఆ ఇల్లాలు. ఈ ఘటన తిరుపతిలో చోటుచేసుకుంది. బాధితురాలు చెప్తున్న వివరాల ప్రకారం.. కరోనా సమయంలో యాప్‌లలో న్యూడ్ వీడియో కాల్స్ మాట్లాడాలని భర్త ఒత్తిడి తెచ్చాడు. ఆ రకంగా డబ్బు సంపాదించాలనే ఆశతో భార్యను బలవంతం చేశాడు. ఆ రకంగా రెండేళ్లలో సుమారుగా 18 లక్షలు సంపాదించారు. అయితే న్యూడ్ వీడియో కాల్ ఒకటి వైరల్ కావటంతో ఇప్పుడా భార్యను దూరం పెట్టాడు. ఈ ఘటనపై బాధితురాలు మీడియాతో తన గోడు వెళ్లబోసుకుంది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

# సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు
## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్




భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ అన్నారు.జిల్లా పరిధిలోని పరిశ్రమలు,వ్యాపార సముదాయాలు,కాలనీలు మరియు ఇండ్ల పరిసరాలలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని,సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.దొంగతనాల నివారణకు,రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.జిల్లాలోని ప్రధాన రహదారులు,ముఖ్యమైన ప్రదేశాలలో కెమెరాలను ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశ్రమల యాజమాన్యాలు,వ్యాపారస్తులు మరియు అన్ని వర్గాల ప్రజలు పోలీసు వారికి సహకరించాలని కోరారు.ఇప్పటికే జిల్లాలో నమోదైన చాలా కేసులలో సీసీ కెమెరాల ద్వారా నిందితులను పట్టుకోవడం జరిగిందని అన్నారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలు మరియు కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.నేరాలను ఛేదించడంతోపాటు నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారిందని అన్నారు.కావున జిల్లా ప్రజలందరూ పోలీస్ యంత్రాంగానికి సహకరిస్తూ తాము నివసించే ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# సంజన కోర్టీ యార్డులో మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి ఫ్రీ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణ




కండ్లకోయాలోని సంజన కోర్టీ యార్డ్ లో మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నాడు ఫ్రీ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. భారీ సంఖ్యలో ఈ కార్యక్రమానికి కోటి యార్డ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కోటి యార్డ్ చైర్మన్ ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేటి ఆధునిక యుగంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆరు నెలలు కోసారైనా వ్యక్తిగత వైద్య పరీక్షలు చేయించుకొని ఏదైనా సమస్య ఉంటే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించిన మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి యాజమాన్యానికి మరియు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటి యార్డ్ ప్యానెల్ సభ్యులు పాల్గొన్నారు



# దుండిగల్ 2 తండాలో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలో పాల్గొన్న కొర్ర ప్రవీణ్ నాయక్

శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం(GVS) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్ర ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ గిరిజనుల ఆరాధ్య దైవం అని ఆయన చూపించిన మార్గంలోని మేమంతా పయనిస్తున్నామని తెలిపారు. ఆయన బోధనల ద్వారా సమాజానికి మార్గదర్శకంగా ఉంటామని సమాజ అభ్యున్నతికి పాటుపడతామని తెలిపారు. సేవలాల్ మహారాజు జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15 జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో తక్షణమే గిరిజనులకు మంత్రి పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు.

# విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**రాష్ట్ర ప్రభుత్వానికి కానరాని విద్యా వ్యవస్థ**

**తెలంగాణకు విద్యాశాఖ మంత్రి కేటాయించాలి**

**చంద్రుగొండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పిటి మేడంని నియమించాలి**

**పలు హాస్టల్లో సందర్శించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ**

చంద్రుగొండ 15 ఫిబ్రవరి క్రాంతిన్యూస్ : చంద్రుగొండ మండల కేంద్రంలోని పలు హాస్టలను మరియు పాఠశాలను



సందర్శించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ...మండల కేంద్రంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్కూల్ బిల్డింగ్ సరిపోక విద్యార్థుల అవస్థలు పడుతున్నారని,పైన పెచ్చులు ఎప్పుడు పడతాయో తెలియని విధంగా ఉందని విద్యార్థులు భయాందోళన గురవుతున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులపై ఎలుకల దాడి చేసిన విషయం తెలిసిందే సిబ్బందితో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కేజీబీవీ చంద్రుగొండలో ఇష్టానుసారంగా నడుస్తుందన్నారు. అదేవిధంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో పిటి టీచర్లను నియమించాలని , బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు . సరిపడా మరుగుదొడ్డు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందింది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు .లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా అఖిల భారత విద్యార్థి ప్రదర్శన ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి తేజ,రామ్ , హేమంత్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



# పీకే రామయ్య కాలనీ లో పోచమ్మ కొలుపు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు మరియు ఆత్మీయులకు ఆహ్వానం పలికిన మడిపెల్లి మల్లేష్



రామగుండం,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):రామగుండం కార్పొరేషన్ పరిధిలోని రెండవ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో తేదీ 15,16 శనివారం సాయంత్రం నాలుగు గంటలకు మహాలక్ష్మి భూలక్ష్మి బోనాలు మరియు రేపు ఆదివారం పోచమ్మ కొలుపు కలదు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు రామగుండం ఎమ్మెల్యే దంపతులు

మనాలి రాజ్ ఠాకూర్ హాజరవుతున్నారు రెండు రోజులు జరిగే ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు.సోషల్ మీడియా, ప్రెస్ మీడియా ప్రతినిధులు

మా ఆత్మీయులు అందరు కూడా పాల్గొని పోచమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు

# కలెక్టర్ గారు పోచమ్మ గుడిని తొలగించకండి : ములుగు ప్రజలు




ములుగు జిల్లా ప్రతినిధి,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ములుగు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న పోచమ్మ గుడిని అభివృద్ధి పేరిట కూల్చివేయడం తగదని గ్రామ ప్రజలు నేడు శనివారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. గ్రామ దేవతగా వెలిసిన పోచమ్మ తల్లి గుడి ప్రజలకు ఆశీర్వాదం ఇస్తూ అమ్మ దయతో ప్రజలు క్షేమంగా ఉంటున్నారని, అలాంటి గుడిని అదికారులు తొలగిస్తామనడం సబబుకాదన్నారు. పట్టణ కేంద్రంలో ఉన్న ప్రజలు పోచమ్మ తల్లి ఆశీర్వాదంతో దినదిన అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. (గ్రామ దేవత) పోచమ్మ తల్లి ఊరికి అంగరక్షకురాలుగా ఉంటు ప్రజల యోగ క్షేమాలు చూసుకొనే గుడిని తొలగిస్తామనడం బాధాకరంగా ఉందన్నారు. గ్రామ దేవత పోచమ్మ తల్లినీ కోలుసుకోవడం గ్రామ ఆచారమని, అలాంటి గుడిని తోలగిస్తే అపచారమవుతుందన్నారు. ఊరు పుట్టినప్పటి నుండి ఉన్న పోచమ్మ గుడిని ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో కొలుచుకుంటారని గుర్తు చేశారు. గ్రామ శ్రేయస్సు కోరుతూ ప్రజలకు మంచి జరగాలంటే యధావిధిగా పోచమ్మ గుడి అక్కడే ఉండాలని కోరారు. తాత ముత్తాతల నుండి బస్టాండ్ సమీపంలో ఉన్న పోచమ్మ గుడిని కొలుచుకోవడం ఇక్కడి ప్రజల సంస్కృతి, సాంప్రదాయమన్నారు. అలాంటి ఆచారం ఉన్న సంస్కృతికి భిన్నంగా గుడిని తొలగిస్తామంటే ఊరుకునేది లేదని ప్రజలు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ తో పాటు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్కకు కూడా కలిసి గుడి తొలగించకూడదని కోరుతామని ప్రజలు తెలిపారు. ప్రభుత్వ అధికారులు పోచమ్మ గుడిని తొలగించే ఆలోచన మార్చుకోకపోతే రాబోవు రోజుల్లో ప్రజలు తీవ్రస్థాయిలో ఆందోళనకు సిద్ధమవుతామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎరువ పూర్ణచందర్, నేరళ్ల శంకర్, రేసోజు శ్రీధర్, డోలి రమేష్, కూన సుదర్శన్, ఎలకతుర్తి రాజన్న, శ్రీహరి, యాసం రవి కుమార్, గాదం కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి వేడుకలు



జవహర్ నగర్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి వేడుకలు జవహర్ నగర్ సేవాలాల్ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి బాలాజీ నగర్ ఫైరింగ్ కట్ట నుండి చిన్నపురం చౌరస్తా వరకు భారీ ర్యాలీగా బయలుదేరారు.సేవలాల్ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఉపాధ్యక్షులు, అంగోతు రవి నాయక్, రాజు నాయక్, రాములాల్ నాయక్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాల దేవుడిగా భావించి కొలుస్తారు. ఆయన జయంతిని పండుగలా జరుపుకొంటారు. గిరిజనులకు దశ-దిశను చూపి, హైందవ ధర్మం గొప్పదనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారు. దీంతో శ్రీ సంత్సేవాలాల్ ఇతర కులాలవారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారు.1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీనాయక్ తండాలో సేవాలాల్ మహారాజ్ జన్మించారు. జగదాంబ మాతనే తన మార్గదర్శకురాలిగా, గురువుగా స్వీకరించి ఆమె ఆదేశానుసారం బంజారాల సేవలో నిమగ్న మయ్యారు. సేవాలాల్ ప్రజల మూఢవిశ్వాసమైన జంతుబలికి తీవ్ర వ్యతిరేకి. బంజారాలు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు వివిధ రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తుండేవారు.ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లిం పాలకుల మత ప్రచారం వల్ల బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురైంది. ఈ క్రమంలోనే బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహారాజ్ అవతరించారని సేవాలాల్ మహారాజ్, దండి మేరామయాడీలను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ లంబాడీలు ప్రతి ఏటా తీజ్ ఉత్సవాలను కూడా జరుపుకొంటారు. అనంతపురం జిల్లా గుత్తిలోని గొల్లలదొడ్డి ప్రాంతంలో కుల దైవమైన సేవాలాల్ మహారాజ్ గఢ్ ఉంది.సేవాలాల్ శివ పూజా రుడు. ఆయన తండ్రి, తాతలు తెగ పెద్దలు. తొమ్మిది రోజుల పాటు పెళ్లికాని యువతులు తీజ్ ఉత్సవాల్లో పాల్గొని తమకు వివాహం కావాలని పూజలు చేస్తారు.సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రజల కోసం చేసిన ఉద్యమాలలో ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులను అరికట్టడం వంటివి ఉన్నాయి. సన్మార్గంలో తన జాతిని నడిపించి భారత్లోని దాదాపు 11 కోట్ల బంజారా లకు ఆరాధ్య దైవంగా ఆయన నిలిచారు.బంజారాలు రాజపుత్రుల్లాంటి వారని చరిత్ర కారుడు కల్నల్ టాడ్ పేర్కొన్నారు అంటే వారెంత దృఢకాయులో అర్థం అవుతుంది. లంబాడీలు, బంజారాలు, సుగాలీలు, గ్వార్ భాయ్ అని పిలవబడుతున్న ఈ గిరిజనులు ప్రపంచవ్యాప్తంగా గోర్ బంజారాలుగా పేరుపొందారు. మధ్య యుగంలో మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ పక్షాన పోరాడిన వీరోచిత చరిత్ర బంజారాల సొంతం. దక్కన్ పీఠభూమిలో లంబాడీలు కాకతీయుల కంటే ముందే ఉన్నారని, సంచార జాతివారైనా వీరు రజాకార్లతో పోరాడారని, నవాబులు వారి ధైర్యసాహసాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చారని బంజారాలు ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని, సహాయ గుణం కలవారని, తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ సేవాలాల్ సమితి అధ్యక్షులు ఆంగోతు రవి నాయక్, ఉపాధ్యక్షులు ఆర్.రాజు నాయక్, రాములాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి చందు నాయక్, ఎం రాజు నాయక్, సంయుక్త కార్యదర్శి ఆర్ శ్రీను నాయక్, రవీందర్ నాయక్, కోశాధికారి, చందు నాయక్, ఉమ్మడి కార్యదర్శి రెడ్యా నాయక్, రమేష్ నాయక్, దర్గయ్య నాయక్, ముఖ్య సలహాదారులు సక్రు, దశరథ నాయక్, రెడ్యా నాయక్, కే సంఖ్య నాయక్, ఎల్ రాము నాయక్, లక్ష్మణ్ నాయక్, బి శ్రీను నాయక్, పి గోపాల్ నాయక్, రమేష్ రాథోడ్, వెంకటేష్ రాథోడ్, గోవింద్ చౌహాన్, శంకర్ చౌహాన్, ఆర్. కె. సుభాష్, డి శ్రీను నాయక్, ఎల్ రవి నాయక్, ఏం మన్య నాయక్, డి లక్ష్మణ్ నాయక్, బాదావత్ హనుమంతూ, గుగులోతు లాలు నాయక్, మహిళలు సేవాలాల్ సమితి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# క్యాన్సర్ కణ గుచ్ఛాలను కరిగించే ఔషధం




హెల్త్ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):కొన్ని క్యాన్సర్ కణితులు ఇతర అవయవాలకూ విస్తరిస్తుంటాయి. అక్కడవి కొత్తగా క్యాన్సర్‌గా మారతాయి (మెటాస్టెసిస్). ప్రధాన కణితి నిరంతరం క్యాన్సర్ కణాలను రక్తంలోకి విడుదల చేయటం దీనికి బీజం వేస్తుంది. రక్తంలో ప్రవహించే ఈ కణితి కణాలు చిన్న చిన్న గుచ్ఛాలుగా ఏర్పడి, ఇతర అవయవాల్లో స్థిరపడతాయి. ఇవి క్రమంగా పెద్ద కణితులుగా మారతాయి. ఇలాంటి క్యాన్సర్ల మూలంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా 70 లక్షల మంది మరణిస్తున్నారని అంచనా. వీటిని ఎదుర్కోవటంలో ఈటీహెచ్ జ్యూరిచ్, యూనివర్సిటీ హాస్పిటల్స్ ఆఫ్ బేసల్ అండ్ జ్యూరిచ్, మేసల్ ల్యాండ్ కాంటోనల్ హాస్పిటల్‌కు చెందిన పరిశోధకుల బృందం నిర్వహించిన అధ్యయనం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఇతర అవయవాల నుంచి రొమ్ములోకి వచ్చి స్థిరపడ్డ సముచ్ఛయాల్లోని క్యాన్సర్ కణాల సంఖ్య తగ్గటానికి ఫాక్స్‌గ్లవ్ అనే పువ్వుల నుంచి తీసిన డిజాక్సిన్ అనే మందు బాగా పనిచేస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఇలా ఇది క్యాన్సర్ తలెత్తే ప్రమాదం గణనీయంగా తగ్గటానికి తోడ్పడుతున్నట్టు గుర్తించారు. 'ఇతర అవయవాల నుంచి వచ్చి రొమ్ములో క్యాన్సర్‌గా పరిణమించటమనేది కణాల గుచ్ఛాల సైజు మీద ఆధారపడి ఉంటుంది. ఇవి ఎంత పెద్దగా ఉంటే అంత ఎక్కువగా క్యాన్సర్‌గా మారతాయి' అని పరిశోధకులు చెబుతున్నారు. ఈ గుచ్ఛాల్లోని కణాలు విడిపోయేలా చేయటం ద్వారానే డిజాక్సిన్ పనిచేస్తోంది. ఇది కణితి కణాల మీది పొరలో సోడియం-పొటాషియం పంపులను అడ్డుకుంటుంది. దీంతో కణాలు క్యాల్షియంను ఎక్కువగా లోపలికి తీసుకుంటాయి. ఫలితంగా క్యాన్సర్ కణాలు ఒకదాంతో మరోటి అతుక్కునే సామర్థ్యం తగ్గుతుంది. ఫలితంగా గుచ్ఛం నుంచి విడిపోతాయి. అయితే డిజాక్సిన్ ఒక్కటే కణితిని నిర్మూలించలేదు. క్యాన్సర్ కణాలు చనిపోవటానికి ఇతర మందులు అవసర మవుతాయి.

## డయాబెటిస్?కు “కాకరకాయ” మందు?

హెల్త్ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):డయాబెటిస్ వచ్చాక ఆహారం మొదలు దినసరి కార్యక్రమాల దాకా ఎన్నో మార్పులు చేసుకుంటుంటారు. ఏం చేస్తే షుగర్ లెవల్స్ పెరుగుతాయోనని భయం భయంగా గడుపుతుంటారు. అయితే, వీరికి కాకరకాయ డైట్ సూచిస్తున్నారు నిపుణులు. మరి, వాళ్లు ఏం చెబుతున్నారో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

మధుమేహులు తమ డైలీ డైట్?లో కాకరకాయని చేర్చుకోవడం ఉత్తమ ఫలితాలను ఇస్తుందంటున్నారు నిపుణులు. షుగర్ ఉన్నవారికి కాకరను పోషకాహార పవర్ హౌస్?గా చెప్పుకోవచ్చంటున్నారు. దీనిలో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.




అలాగే, రక్తంలో చక్కెర శోషణని నెమ్మదిస్తుంది. ఫలితంగా చక్కెర రక్తంలో త్వరగా పెరగడాన్ని అడ్డుకుంటుందంటున్నారు.

అన్నింటికంటే ముఖ్యంగా కాకరకాయలో ఉండే “చరాన్టిన్, పాలిపెప్టయిడ్-పి, విసైన్” రక్తంలో ఉన్న గ్లూకోజ్ స్థాయిని తగ్గించడంలో దోహదం చేస్తాయి. అలాగే, దీనిలో ఉండే ఎమ్ఆర్కె-29 అనే ప్రొటీన్ కూడా రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించడంలో సహాయపడుతుందట. కాబట్టి, తరచుగా కాకరకాయను తీసుకోవడం వల్ల దానిలో ఉండే పోషకాలు ఇన్సులిన్ తరహాలో పనిచేసి రక్తంలో షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుతాయంటున్నారు నిపుణులు.

అందుకే, డయాబెటిస్ ఉన్నవారు కాకరను డైలీ డైట్?లో జ్యూస్, ఆహారం రూపంలో తీసుకోవడం మంచి ఫలితాలను ఇస్తుందంటున్నారు. నేషనల్ ఇని?స్టిట్యూట్ ఆఫ్ హెల్త్? సభ్యుల బృందం జరిపిన ఓ రీసెర్చ్?లోనూ కాకరకాయలో ఉండే పోషకాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయని కనుగొన్నారు.

## నల్లద్రాక్షతో గుండె జబ్బులు, క్యాన్సర్‌కు చెక్

### - కానీ వారు మాత్రం ఎక్కువగా తినకూడదట -

హెల్త్ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లు తినాలని డాక్టర్లు సూచిస్తుంటారు. ముఖ్యంగా నల్లద్రాక్ష తినడం వల్ల మన శరీరానికి ఎంతో మేలు కలుగుతుందని అంటున్నారు. దీని వల్ల క్యాన్సర్?, గుండె జబ్బులు లాంటి సమస్యల ముప్పును తగ్గించుకోవచ్చని చెబుతున్నారు. ఇందులో రెస్వెరట్రాల్, ఫ్లేవనాయిడ్స్, ఆంథోసయనిన్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి రక్తం గడ్డకట్టడాన్ని నెమ్మదింప చేస్తాయని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే నల్ల ద్రాక్షతో కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.



గుండె సమస్యలు: ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ సి రోగనిరోధక వ్యవస్థను బలంగా తయారు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇంకా ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ రక్త ప్రసరణను మెరుగు పరిచి హృదయ వ్యాధుల ముప్పును తగ్గిస్తాయని అంటున్నారు. ముఖ్యంగా నల్ల, ఎర్ర ద్రాక్ష తొక్కలో ఉండే రెస్వెరట్రాల్ వల్లనే గుండెకు మేలు చేసే లక్షణాలు వస్తాయని పరిశోధకుల భావిస్తున్నారు. 2018లో Journal of Nutritionలో ప్రచురితమైన “Consumption of Black Grape Extract Reduces Inflammation and Improves Cardiovascular Health in Healthy Adults” అనే అధ్యయనంలోనూ ఈ విషయం తేలింది

అల్జీమర్స్ నివారణ: అల్జీమర్స్ వ్యాధి పురోగతిని తగ్గించడంలో రెస్వెరట్రాల్ దోహదం చేస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇంకా జ్ఞాపకశక్తిని, మెదడు పని తీరును మెరుగు పరుస్తుందని వివరిస్తున్నాయి.

చర్మం: ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు.. ఫ్రీరాడికల్స్‌తో పోరాడి వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో ఎంతగానో సహాయ పడతాయని చెబుతున్నారు.

క్యాన్సర్ తగ్గించే అవకాశాలు: ఇందులో పుష్కలంగా ఉండే రెస్వెరట్రాల్ క్యాన్సర్ పెరుగుదలను తగ్గించినట్లు పరిశోధనల్లో వెల్లడైంది. 50 ఏళ్ల పైబడిన వారు రెండు వారాలు రోజూ ద్రాక్షను తినడం వల్ల వారిలో పెద్దపేగు కేన్సర్ ప్రమాద సూచికలు తగ్గినట్లు పరిశోధనల్లో గుర్తించారు.

మలబద్ధకం, ఊబకాయంపై పోరు: రెస్వెరట్రాల్, ప్టిరోస్టిల్బెన్ ఒబెసిటీని నియంత్రించడంలో సహాయ పడతాయని నిపుణులు చెబుతున్నారు. ద్రాక్షలోని ఫైబర్ జీర్ణ క్రియను మెరుగుపరిచి.. మలబద్ధకాన్ని నివారిస్తుందని చెబుతున్నారు.

ఎముక పుష్టి: ద్రాక్షలో ఉండే కాల్షియం, మెగ్నీషియం వంటి మినరల్స్ ఎముకలను బలంగా ఉంచుతాయని అంటున్నారు. విటమిన్ ఎ రోగ నిరోధక శక్తికి తోడ్పడుతుందని చెబుతున్నారు. కణాల ఎదుగుదలకు, కంటి ఆరోగ్యానికి దోహదం చేస్తుందని వివరిస్తున్నారు. అనారోగ్యాల నుంచి త్వరగా కోలుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.


పోషకభరితం: నల్ల ద్రాక్షలో అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో 82% నీరు ఉంటుందని.. వీటిలో అతి తక్కువ కాలరీలు ఉండటానికి అదే కారణమని వివరిస్తున్నారు. 31 క్యాలరీలు, కార్బో హైడ్రేట్లు 8 గ్రాముల, చక్కెరలు 7 గ్రాములు ఉంటాయని.. ఎలాంటి కొవ్వు, కొలెస్ట్రాల్ ఉండదని చెబుతున్నారు. ఇంకా ఇందులో పొటాషియం, విటమిన్ సి, కే, మెగ్నీషియం, రాగి, క్యాల్షియం పుష్కలంగా ఉంటాయని వివరిస్తున్నారు.

## జలుబు, దగ్గుకి అల్లంతో పెరటి వైద్యం

హెల్త్ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):సీజనల్ అనారోగ్య సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. వీటిలో మరీ ఎక్కువగా వేధించే సమస్య దగ్గు, జలుబు. అల్లం తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు రాకుండా ఉంటాయి. ఎలా తీసుకోవాలో చూద్దాం.



టీతో - అల్లం తురుమును టీలో మరిగించి త్రాగాలి.నీటితో - ఒక గ్లాసు నీటిలో కొన్ని అల్లం ముక్కలు వేసి వేడిగా ఉన్నప్పుడు త్రాగాలి.కూరగాయలతో - అల్లం తురుము, కూరగాయలలో వేసి ఉడికించాలి.తేనెతో - అల్లం చూర్ణం చేసి దాని రసాన్ని ఒక చెంచా తీసి అర చెంచా తేనెతో కలిపి త్రాగాలి. చట్నీతో - అల్లం గ్రైండ్ చేసి పేస్టులా చేసి చట్నీలో కలుపుకుని తినవచ్చు.సలాడ్‌తో - తురిమిన అల్లం సలాడ్‌తో కలపవచ్చు.బెల్లంతో పాటు - బెల్లం కలిపిన కొన్ని అల్లం ముక్కలను కూడా తీసుకోవచ్చు.ఇంటి చిట్కాలు సమాచారం కోసం మాత్రమే. డాక్టర్ సలహా తీసుకుని చిట్కాలు పాటించవచ్చు.



KR TV క్రాంతి
ఆదివారం 16 ఫిబ్రవరి 2025

# క్రీడలు

epaper.krtvnews.com



## కొత్త సారథిగా బుమ్రా!
## రోహిత్‌ను ఒప్పించిన బీసీసీఐ..?



స్పోర్ట్స్ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ సిద్ధమవుతోంది. ఆ తర్వాత ఐపీఎల్ మ్యాచులు ఉంటాయి. జూన్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ ప్రారంభమవుతుంది. రోహిత్ శర్మ టెస్టుల్లో కొనసాగుతాడా? లేదా? అనేది ఇంకా తెలియదు. బీసీసీఐ పెద్దలు మాత్రం రోహిత్ స్థానంలో కొత్త సారథిని నియమించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. బుమ్రాకు బాధ్యతలు అప్పగించేలా రోహిత్‌ను ఇప్పటికే ఒప్పించినట్లు కథనాలు వస్తున్నాయి.

### అందుకే బరిలోకి దింపలేదా?

బుమ్రా వెన్ను నొప్పి కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి వైదొలిగాడు. గత ఆస్ట్రేలియా పర్యటనలో వెన్ను నొప్పి తిరగబెట్టడంతో జాతీయ క్రికెట్ అకాడమీ వైద్యబృందం స్కానింగ్‌లు నిర్వహించింది. అన్నింట్లోనూ బాగానే ఉన్నప్పటికీ.. పూర్తి స్థాయిలో బౌలింగ్ చేసేందుకు బుమ్రా ఇబ్బంది పడ్డాడు. దీంతో వైద్య బృందం బుమ్రాను ఆడించే అంశాన్ని సెలక్టర్లకే వదిలేసింది. కేవలం బౌలర్‌గానే కాకుండా.. భవిష్యత్తులో టీమ్‌ఇండియా కెప్టెన్సీని అప్పగించే ఉద్దేశంతో బుమ్రా విషయంలో రిస్క్ తీసుకోలేదని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం టెస్టు ఫార్మాట్‌లో బుమ్రానే జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా తొలి టెస్టుకు బుమ్రా సారథ్యం వహించాడు. అప్పటికి రోహిత్ ఇంకా ఆస్ట్రేలియాకు చేరుకోలేదు. ఆ మ్యాచ్‌లో బుమ్రా జట్టును విజయ పథంలో నడిపించాడు. చివరి టెస్టులోనూ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ.. వెన్ను నొప్పితో రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయలేకపోయాడు. ఆ సిరీస్‌లో బౌలింగ్‌తోనే కాకుండా తన నాయకత్వ పటిమతో అభిమానులను అబ్బురపరిచాడు.

"గత నెలన్నర రోజుల నుంచి బుమ్రా విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతడు ఇంకా పూర్తిస్థాయిలో బౌలింగ్ చేయలేదు. ఐపీఎల్ నాటికి అతడు బౌలింగ్ ఫిట్‌నెస్ సాధిస్తాడని క్రికెట్ అభిమానులు ఎదురు చూస్తున్నారు. రోహిత్‌ను టెస్టులకు ఎంపిక చేయకపోతే మాత్రం.. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు బుమ్రానే సారథి. బీసీసీఐ కూడా ఇదే ఉద్దేశంలో ఉంది" అని పీటీఐ పేర్కొంది.

## ఎనిమిదేళ్ల తర్వాత.. ఇంత గ్యాప్
## ఎందుకొచ్చిందో తెలుసా?

స్పోర్ట్స్ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ప్రతి రెండేళ్లకు ఒకసారి జరగాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీ ఈసారి ఏకంగా ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతోంది. చివరగా 2017లో జరిగిన ఛాంపియన్స్‌ని ట్రోఫీ మళ్లీ 2025లో నిర్వహిస్తున్నారు. ఒకవేళ గ్యాప్ వస్తే మూడేళ్లు, లేదంటే నాలుగేళ్లు కానీ ఎనిమిదేళ్లు ఎందుకు వచ్చిందని మీరు ఆలోచించారు. వన్డే ఫార్మాట్‌లో ప్రపంచకప్ లాగానే మరో మెగా టోర్నీని నిర్వహించాలనే ఉద్దేశంతో ఛాంపియన్స్ ట్రోఫీకి శ్రీకారం చుట్టారు. వరల్డ్‌కప్‌లా అన్ని జట్లు



పాల్గొనకుండా ప్రపంచ క్రికెట్‌లోని టాప్-8 టీమ్స్ మాత్రమే ఇందులో ఉండేలా కండీషన్ పెట్టారు. అంటే ప్రతీ మ్యాచ్ కూడా ఫైనల్‌లా జరగాలనేదే ఐసీసీ ఉద్దేశం.క్రికెట్ అభిమానులకు మరింత ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు ఐసీసీకి 1998లో ఈ ఐడియా వచ్చింది. బంగ్లాదేశ్ వేదికగా తొలి ఎడిషన్‌కు శ్రీకారం చుట్టారు. ఫస్ట్ టైటిల్‌ను సౌతాఫ్రికా జట్టు గెలుచుకుంది. తొలుత ఐసీసీ నాకౌట్ ట్రోఫీ అని పిలిచేవాళ్లు. 2022లో దీన్ని ఛాంపియన్స్ ట్రోఫీగా నామకరణం చేశారు. ఆ ఏడాదే భారత్-శ్రీలంక జట్లు ఛాంపియన్స్ ట్రోఫీని పంచుకున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ఇప్పటి వరకు ఎనిమిదిసార్లు జరగ్గా భారత్, ఆస్ట్రేలియా జట్లు అత్యధికంగా రెండ్రెండు సార్లు ట్రోఫీని అందుకున్నాయి. 2017లో చివరగా జరిగిన ట్రోఫీలో భారత్‌ను ఓడించి పాకిస్తాన్ ఛాంపియన్స్‌గా నిలిచింది. 2006 వరకు రెండేళ్లకు ఒకసారి జరిగిన ఈ టోర్నీ ఆ తర్వాత నుంచి మూడేళ్లకు ఒకసారి, ఆ తర్వాత నాలుగేళ్లకు నిర్వహించడం మొదలుపెట్టారు. 2017 తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీని ఆపేయాలంటూ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. వన్డే వరల్డ్‌కప్‌లో జట్లే పోటీ పడుతున్నాయి, పైగా అవే యాభై ఓవర్లు మ్యాచ్ అలాంటప్పుడు ఈ టోర్నీ ఎందుకని 2021లో కొందరు అడ్డంకి చెప్పడంతో ఛాంపియన్స్ టోర్నీని ఐసీసీ నిలిపేసింది. టీ20 ఫీవర్ ఎక్కువైన ఈ తరుణంలో మళ్లీ వన్డే క్రికెట్‌లో జోష్ నింపేందుకు ఛాంపియన్స్ ట్రోఫీని తెరపైకి తీసుకొచ్చారు. పాకిస్తాన్ వేదికగా హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించనున్నారు. మొత్తం ఎనిమిది జట్లు పాల్గొనే ఈ టోర్నీలో రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ ఏలో భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్. గ్రూప్ బీలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, అఫ్ఘనిస్తాన్ జట్లు ఉన్నాయి.

పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు సరిగా లేని కారణంగా భారత్ ఆడే మ్యాచ్‌లకు మాత్రం దుబాయ్ వేదిక కానుంది. ఒకవేళ భారత్ సెమీ ఫైనల్స్, ఫైనల్స్‌కు చేరుకున్నా దుబాయ్‌లోనే ఆ మ్యాచ్‌లు జరుగుతాయి. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుండగా.. భారత్ తన తొలి మ్యాచ్ ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది. హై ఓల్టేజ్ భారత్-పాకిస్తాన్ మ్యాచ్ ఫిబ్రవరి 23న జరగనుంది.

## మిడిలార్డర్ కథ మారింది



స్పోర్ట్స్ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):'తుదిజట్టులో చోటు లేకపోవడంతో హోటల్ గదిలో సినిమా చూస్తున్నా. అర్ధరాత్రి కెప్టెన్ రోహిత్ ఫోన్ చేసి.. తొలి వన్డేలో కోహ్లి స్థానంలో నువ్వు ఆడాలి అనడంతో వెంటనే టీవీ కట్టేసి పడుకున్నా"

..ఇంగ్లాండ్‌తో మొదటి వన్డే అనంతరం భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలివి. అలా అనుకోకుండా ఆ మ్యాచ్ ఆడిన శ్రేయస్.. టీమ్‌ఇండియాకు ఇప్పుడు ఎంతో కీలకంగా మారాడు. ఆందోళన రేకెత్తిస్తున్న మిడిలార్డర్‌ను పటిష్ఠంగా మార్చాడు. కొన్నిసార్లు ప్రతికూలం అవుతాయనుకున్న విషయాలు కూడా మేలే చేస్తాయనడానికి ఇదే ఉదాహరణ.


శ్రేయస్ అయ్యర్ లాంటి నాణ్యమైన బ్యాటర్‌కు భారత జట్టులో సుస్థిర స్థానం లేకపో వడం ఆశ్చర్యం కలిగించిందంటూ ఇటీవల వ్యాఖ్యానించాడు ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాడు రికీ పాంటింగ్. శ్రేయస్ ప్రతిభకు నిజంగానే అతను భారత జట్టులో రెగ్యులర్ ఆటగాడిగా ఉండాలి. అతను టీమ్‌ఇండియా కెప్టెన్ అవుతాడని విశ్లేషకులు అంచనా వేసిన క్రికెటర్. కానీ గాయాలు, నిలకడలేమితో జట్టులో అతడి స్థానానికి గ్యారెంటీ లేకుండా పోయింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో అతను ఎంతో నిలకడగా రాణించినా.. ఆ తర్వాత ఫిట్‌నెస్ సమస్యలు తలెత్తడం, ఫామ్‌తో తంటాలు పడడం అతడికి చేటు చేశాయి. దీంతో జట్టులో స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు జట్టులోకి ఎంపికైనప్పటికీ.. తుది జట్టులో చోటు దక్కించుకోలేని స్థితిలో ఉన్నాడు శ్రేయస్. ఈ సిరీస్‌లో యశస్వి జైస్వాల్‌ను టాప్ ఆర్డర్‌లో ఆడించాలనుకుంది జట్టు యాజమాన్యం. అయితే తొలి వన్డే ముంగిట కోహ్లి మోకాలు వాచి, మ్యాచ్‌కు దూరం కావడంతో అనుకోకుండా శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం దక్కింది. దీన్ని అతను రెండు చేతులా ఉపయోగంచుకున్నాడు. మెరుపు అర్ధశతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కోహ్లి తప్పుకోకపోయి ఉంటే తాను ఈ మ్యాచ్‌లో ఆడేవాడిని కాదని స్వయంగా శ్రేయసే చెప్పడం విశేషం.

### అలా కలిసొచ్చింది..

తొలి వన్డేలో కోహ్లి ఆడి ఉంటే వన్డే సిరీస్‌లో శ్రేయస్ పేరే వినిపించేది కాదేమో! యశస్వి జైస్వాల్‌ను సిరీస్‌లో ఓపెనర్‌గా ఆడించి, నాలుగో స్థానంలో గిల్‌ను దించాలని అనుకుంది భారత్. అయితే తొలి వన్డేకు కోహ్లి అందుబాటులో లేకపోవడంతో గిల్ మూడో స్థానంలో దిగాడు. శ్రేయస్ నాలుగులో ఆడాడు. కోహ్లి తొలి మ్యాచ్ ఆడి, జైస్వాల్ రాణించి ఉంటే.. అదే కూర్పు కొనసాగేది. అప్పుడు కొంత కాలంగా భారత్‌ను వేధిస్తున్న మిడిలార్డర్ సమస్య అలాగే కొనసాగేది. ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా అది తలనొప్పిగా మారేది. కానీ తొలి వన్డేలో అయ్యర్‌కు అవకాశం రావడం.. మిడిలార్డర్ సమస్యకు తెరదించింది. వరుసగా మూడు వన్డేల్లో శ్రేయస్ రాణించడంతో బ్యాటింగ్ బలోపేతం అయింది. తొలి వన్డేలో భారత్ లక్ష్యం 249 పరుగులు. కానీ 19 పరుగులకే యశస్వి జైశ్వాల్, రోహిత్ పెవిలియన్‌కు చేరుకున్నారు. గత కొంతకాలంగా భారత బ్యాటింగ్ ఓపెనర్ల ఇన్నింగ్స్‌లపైనే ఆధారపడింది. ఓపెనర్లలో ఎవరో ఒకరు ధాటిగా లేదా పెద్ద ఇన్నింగ్స్ ఆడితేనే మిగతా వాళ్లు అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 6 ఓవర్లలోపే ఓపెనర్లు నిష్క్రమించడం భారత శిబిరాన్ని ఆందోళనకు గురిచేసింది. కానీ ఆత్మవిశ్వాసంతో క్రీజులో అడుగుపెట్టిన శ్రేయస్ (59).. మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అయ్యర్ కంటే ముందొచ్చిన గిల్.. ఆ తర్వాత బరిలో దిగిన అక్షర్ పటేల్ అదే జోరు కొనసాగించడంతో 39 ఓవర్లలోపే భారత్ లక్ష్యాన్ని ఛేదించింది. రెండో వన్డేలో రోహిత్ అద్వితీయ సెంచరీ భారత్ మెరుగైన స్కోరుకు బాటలు వేసినా.. అయ్యర్ (44) ఇన్నింగ్స్ పాత్ర విలువైందే. మూడో వన్డేలో భారత్ భారీ స్కోరు సాధించడంలోనూ శ్రేయస్ (78) ముఖ్య పాత్ర పోషించాడు. గిల్ సెంచరీ ఇన్నింగ్స్‌కు అయ్యర్ దూకుడు ఇరుసులా పనిచేసింది. మొత్తంగా వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగుల్లో గిల్ (259) తర్వాత స్థానం అయ్యర్ (181)దే. అత్యంత కీలకమైన స్థానంలో దూకుడుగా ఆడుతూ ఇన్నింగ్స్‌కు ఇరుసులా మారాడు.

నిజానికి ఇంగ్లాండ్‌తో మొదటి వన్డేలో బరిలో దిగాలనుకున్న బృందమే ఛాంపియన్స్ ట్రోఫీలో తుది జట్టుగా అనిపించింది. టాప్‌ఆర్డర్‌లో జైశ్వాల్, రోహిత్, గిల్.. మిడిలార్డర్‌లో కోహ్లి, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య.. ఆ తర్వాత ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్.. బౌలర్లుగా షమి, కుల్‌దీప్, హర్షిత్ రాణా/అర్ష్‌దీప్ సింగ్ బరిలో దిగడం ఖాయంగా కనిపించింది. అయితే ఊహించని విధంగా తొలి వన్డేలో శ్రేయస్ ఆడటం సమీకరణాల్ని మార్చేసింది. ఓపెనర్ స్థానాన్ని గిల్ తీసుకోగా.. మిడిలార్డర్‌లో అయ్యర్ తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నాడు. శ్రేయర్ సత్తా చాటుతుండడంతో వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న రాహుల్‌పై భారం కూడా తగ్గినట్లయింది. అంతే కాక అయిదో స్థానం నుంచి ప్రయోగాలు చేసుకునేందుకు జట్టు యాజమాన్యానికి వెసులుబాటు లభించింది. అవసరానికి తగ్గట్లు అక్షర్ పటేల్ లేదా రవీంద్ర జడేజాను అయిదో నంబరులో ఆడించే అవకాశం దొరికింది. అక్షర్ ఇలా ఛాన్స్ దక్కించుకుని రెండు కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. అయ్యర్ తర్వాత రాహుల్, హార్దిక్, అక్షర్, జడేజాల రూపంలో

క్రాంతి
# సినిమా న్యూస్
epaper.krtvnews.com



## కథ నచ్చితే.. అమ్మమ్మ పాత్రకైనా సిద్ధమే !

మూవీ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): కథ తనకు నచ్చితే.. ఇద్దరు పిల్లల తల్లిగా నటించడానికైనా వెనకాడనని అంటోంది అందాల తార రష్మిక . గతేడాది 'పుష్ప 2'తో హిట్ కొట్టిన ఆమె.. ఆ జోరులోనే తాజాగా 'ఛావా' సినిమాతో తెరపైకి వచ్చింది. ఇందులో ఏసుబాయి పాత్రలో కనిపిస్తూ ప్రశంసలు అందుకుంటోన్న రష్మిక మాట్లాడుతూ.. "నేను జీవితాన్ని ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోను. కెరీర్ పరంగా నన్ను ఏదో ఒక దైవిక శక్తి ముందుకు నడిపిస్తున్నట్లు అనిపిస్తుంటుంది. కథ మనకు అనుగుణంగా ఉండాలంటే జీవితం కష్టంగా మారుతుంది. కానీ.. ఆ కథను నడిపించడంలో నేను ముఖ్య భాగం అనుకునే సినిమాలు వచ్చినప్పుడు.. పాత్ర ఏదైనా అంటే ఇద్దరు పిల్లల తల్లి అయినా.. ఆఖరికి అమ్మమ్మ పాత్ర అయినా నాకు పట్టింపు లేదు. కథ నన్ను ఉత్తేజపరిస్తే చాలు.. నేను ఆ సినిమాలో ఏమి చేస్తున్నాను అనే దానితో సంబంధం లేదు. ఎప్పుడూ వ్యూహాత్మకంగా చిత్రాల్ని ఎంపిక చేసుకోను. ప్రస్తుతం అదృష్టవశాత్తూ..గొప్ప చిత్రాల్లో భాగం కావాల్సి వస్తుంది. ఇలా అనుకోకుండా ఎంచుకున్న చిత్రాలే ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నాయి" అంటూ తన మనసులోని మాటల్ని బయటపెట్టింది రష్మిక. సల్మాన్‌ఖాన్ హీరోగా నటిస్తున్న 'సికందర్'లో సెట్లోకి శుక్రవారం అడుగుపెట్టింది రష్మిక.

## హరి హర వీరమల్లు'..
### మాస్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి

మూవీ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరి హర వీరమల్లు' . క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది. ఇందులో పవన్ సరసన నిధి అగర్వాల్ నటిస్తున్నారు. తాజాగా ఆమె ఈ సినిమా గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. ఈ సినిమాలో ఎన్నో మలుపులు ఉంటాయన్నారు.

"సినిమాలోని కొన్ని మలుపులు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి. కథ కూడా చాలా వేగంగా ఉంటుంది. ఔరంగజేబు ట్రాక్ ఒక భాగం మాత్రమే ఉంటుంది. పూర్తి సినిమా దానిపైనే ఆధారపడి ఉండదు. నా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. కేవలం డ్యాన్స్‌కు మాత్రమే పరిమితమయ్యే పాత్ర కాదు. ఇటీవల విడుదల చేసిన పోస్టర్ షూటింగ్ మొదటిరోజుది. నేను ఇప్పటివరకు చేసిన సినిమాల్లో 'హరి హర వీరమల్లు' ఉత్తమమైనది. పవన్ కల్యాణ్ నటన చూసి ఒక్కోసారి ఆశ్చర్యపోయేదాన్ని. ఎంత కష్టమైన సన్నివేశం అయినా మూడు నిమిషాల్లో నటించేస్తారు. "కొల్లగొట్టినాదిరో.." పాట పెద్ద సెట్‌లో చిత్రీకరించారు. ఈ సినిమాలో మాస్ ఎలిమెంట్స్‌తో ఉన్న డ్యాన్స్ నంబర్లు కూడా ఉన్నాయి. దీని కంటెంట్ అందరికీ నచ్చుతుంది. యాక్షన్ సన్నివేశాలు కూడా చాలా ఉన్నాయి. షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది" అని చెప్పారు. ఇందులో పవన్ కల్యాణ్ యోధుడిగా కనిపించనుండగా.. నిధి అగర్వాల్ పంచమి అనే యువరాణి పాత్రలో కనిపించనున్నారు.

రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ సినిమా తొలి భాగం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో మార్చి 28న విడుదల కానుంది . ఈ సినిమాలో ఇప్పటికే తొలి గీతాన్ని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ సినిమా నుంచి రెండో పాటను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. "కొల్లగొట్టినాదిరో.." అంటూ సాగే ఆ ప్రేమ గీతాన్ని ఈనెల 24న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించింది. అనుపమ్‌ఖేర్, బాబీ దేవోల్, నోరాహి ఫతేహి కీలకపాత్రలు పోషిస్తున్నారు.



## క్లాసిక్ కాంత



మూవీ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మాతలు. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రేమికుల రోజు పురస్కరించుకుని శుక్రవారం ఈ చిత్రంలోని భాగ్యశ్రీ బోర్సే లుక్‌ని విడుదల చేశాయి సినీ వర్గాలు. అందులో సంప్రదాయం ఉట్టిపడే అలంకరణతో అందంగా కనిపించింది భాగ్యశ్రీ. "1950లనాటి కాలాన్ని ప్రతిబింబిస్తూ, మద్రాస్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. మానవ సంబంధాలు, సామాజిక సంక్లిష్టతల్ని ఆవిష్కరించే ఓ గొప్ప కథ. ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతిని పంచుతుంద"ని సినీ వర్గాలు తెలిపాయి.

## ఎట్టకేలకు అల్లుడి కోరిక తీర్చిన చిరు..

మూవీ న్యూస్,15 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):టాలీవుడ్‌లో హీరోల్లో ప్రతి ఒక్కరూ చిరంజీవితో స్క్రీన్ షేర్ చేసుకోవాలని, డైరెక్టర్లు అయితే ఆయనతో ఒక సినిమా అయినా డైరెక్ట్ చేయాలనుకుంటారు. అలా ఎదురుచూసే వాళ్లు లెక్కలేనంత మంది ఉంటారు. ఆ క్యూలైన్‌లో మెగా మేనల్లుడు సాయిధరమ్ తేజ్ కూడా ఉన్నాడు. బ్రో సినిమాతో పవన్‌లో స్క్రీన్ షేర్ చేసుకున్న ఆయన మెగాస్టార్ చిరంజీవితోనూ స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఎప్పటి నుంచో కలలు కంటున్నాడు. ఇప్పటికీ అతని కల నెరవేరబోతోంది. ఎట్టకేలకు చిరంజీవి సినిమాలో నటించే అవకాశం సాయి దుర్గ తేజ్ అందుకున్నారు. మామా అల్లుళ్ళ ఇద్దరూ కలిసి సిల్వర్ స్క్రీన్ మీద సందడి చేసేందుకు రెడీ అయ్యారు. ఇప్పటికే షూటింగ్ కూడా మొదలైంది. అయితే, ఇక్కడ ఒక చిన్న ట్విస్ట్ ఉంది. సాయి దుర్గా తేజ్ ఫుల్ లెంగ్త్ రోల్ చేయడం లేదు. అతిథి పాత్రలో సందడి చేయబోతున్నారు. చిరంజీవి హీరోగా రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర' . వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఓ అతిథి పాత్రలో తేజ్ చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీలో మామా అల్లుళ్ల మీద సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. వచ్చే వారం కూడా మూడు నాలుగు రోజులు చిత్రీకరణ చేయనున్నారని తెలిసింది. చిరంజీవి మీద శోభిత మాస్టర్ కొరియోగ్రఫీలో ఇంట్రడక్షన్ సాంగ్ తీస్తున్నారు. బహుశా... ఆ పాటలో మామా అల్లుళ్ళు సందడి చేసే అవకాశం ఉంది. 'విశ్వంభర'లో చిరంజీవి సరసన త్రిష, ఆషికా రంగనాథ్ నటిస్తున్నారు. ఇషా చావ్లా, సురభి, రమ్య పసుపులేటి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యువి క్రియేషన్స్ పతాకం మీద విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. వేసవిలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక సాయితేజ్ విషయానికి వస్తే ప్రస్తుతం రోహిత్ కేపీని దర్శకుడిగా పరిచయం చేస్తూ 'సంబరాల యేటి గట్టు' సినిమా చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రానికి ప్రేక్షకుల నుంచి చక్కని స్పందన వచ్చింది



Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com